PRGI REGD NO: TGTEL/25/A1385

మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

సోమవారం MONDAY 6-4-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 277 Issue: 277

06 ఏప్రిల్ 2026 - సోమవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - వసంత ఋతువు చైత్ర మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:10 సూర్యాస్తమయం - సా. 6:26 తిథి చవితి మ. 2:12 వరకు తరువాత పంచమి సంస్కృత వారం ఇందు వాసరః నక్షత్రం అనురాధ రా. 2:50 వరకు తరువాత జ్యేష్ఠ యోగం సిద్ధి మ. 3:20 వరకు కరణం భాలవ మ. 2:12 వరకు కౌలవ తె. 3:22 వరకు వర్జ్యం తె. 4:35 నుండి ఉ. 6:22 వరకు దుర్ముహూర్తం మ. 12:43 నుండి మ. 1:32 వరకు మ. 3:10 నుండి మ. 3:59 వరకు రాహుకాలం ఉ. 7:42 నుండి ఉ. 9:14 వరకు యమగండం ఉ. 10:46 నుండి మ. 12:18 వరకు గుళికాకాలం మ. 1:50 నుండి మ. 3:22 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:34 నుండి తె. 5:22 వరకు అమృత ఘడియలు మ. 3:18 నుండి సా. 5:06 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:54 నుండి మ. 12:43 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

Published from Jagitial
Circulated to Telangana



## సిమెంట్ ధరలు పైపైకి

### రూ.50 వరకు పెరిగే చాన్స్!

ముంబై: పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు ఇప్పుడు నిర్మాణ రంగంపైనా ప్రభావం చూపుతోంది. పెరుగుతున్న ముడిసరుకుల ధరలు, అధిక డిమాండ్, ప్రపంచ సరఫరా అంతరాయాల వల్ల సిమెంట్ తయారీ కంపెనీలు ధరలు పెంచేందుకు సిద్ధమవుతున్నాయని పరిశ్రమ వర్గాలు వెల్లడించాయి. అల్ట్రాటెక్ సిమెంట్ వంటి ప్రధాన తరువాయి 2 వ పేజీలో...

## అమూల్ లక్ష కోట్ల యాపారం


అహ్మదాబాద్: దేశంలో డైరీ ఉత్పత్తుల్లో అగ్ర సంస్థగా ఉన్న అమూల్ అరుదైన ఘనత సాధించింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో లక్ష కోట్ల వ్యాపార సంస్థగా నిలిచింది. ఈ ఏడాది సంస్థ ఏకంగా 11 శాతం వృద్ధి సాధించింది. అమూల్.. గుజరాత్‌కు చెందిన సంస్థ. ద గుజరాత్ కోఆపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్ లిమిటెడ్ (జీసీఎంఎంఎఫ్) సంస్థ అమూల్ బ్రాండ్‌తో వ్యాపారం నిర్వహిస్తుంటుంది. ఈ ఆర్థిక సంవత్సరంలో 11 శాతం వృద్ధితో, లక్ష కోట్లకుపైగా వ్యాపారాన్ని నిర్వహించినట్లు సంస్థ తాజాగా ప్రకటించింది. ఈ సంస్థ ఇంతకుముందు 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.90,000 కోట్ల వ్యాపారం సాధించింది. ఇప్పుడు దీన్ని అధిగమించి, భారీ లాభాలతో తరువాయి 2 వ పేజీలో...



## 5 కిలోల సిలిండర్లకు మస్తు గిరాకీ

### 2 వారాల్లో 6.6 లక్షలు సేల్

న్యూఢిల్లీ: పశ్చిమాసియా పరిస్థితుల నేపథ్యంలో.. భారత్‌లో ఐదు కిలోల చిన్న ఎల్‌పీజీ సిలిండర్లకు ఆదరణ పెరిగింది. మార్చి 23 నుంచి ఇప్పటివరకు సుమారు 6.6 లక్షల సిలిండర్లు అమ్ముడైనట్లు కేంద్రం వెల్లడించింది. చెల్లుబాటయ్యే గుర్తింపు పత్రాలు చూపించడం ద్వారా సమీపంలోని ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్ల -2 వ పేజీలో...



# కాంగ్రెస్ గద్దలు

## 7000 కోట్ల భూమిని తన్నుకుపోతున్నారు

నాదర్‌గుల్‌లో రూ. 7 వేల కోట్ల విలువైన 373 ఎకరాల ప్రభుత్వ భూమిని కాంగ్రెస్ పెద్దలు గద్దల్లా తన్నుకుపోతున్నారు. హైకోర్టు తీర్పును బేఖాతరు చేస్తూ అధికార బలంతో బౌన్సర్లను పెట్టి పేద రైతులపై దాడులు చేయిస్తున్నారు. ఈ భారీ భూ కుంభకోణం, కబ్జా కంపెనీల వెనుక ఉన్నది సాక్షాత్తూ రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి కుటుంబమేనని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ఆరోపించారు.

### 373 ఎకరాల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం

### కబ్జా వెనుక మంత్రి పొంగులేటి కుటుంబం

### మాజీమంత్రి హరీశ్ రావు తీవ్ర ఆరోపణలు

హైదరాబాద్, ఏప్రిల్ 5 (ఈవార్తలు): తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు మాట్లాడుతూ.. పేదల ఇళ్లు కూలగొట్టే 'హైడ్రా'కు .. అధికార పార్టీ నేతల వేల కోట్ల కబ్జాలు, చెరువుల ఆక్రమణలు ఎందుకు కళ్లు కనిపించదు సీఎం రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే కబ్జాదారులను అరెస్ట్ చేసి, రైతులను భూముల్లోకి అనుమతించాలి. నాదర్‌గుల్ భూములపై రేపు ఉదయం వరకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ చర్యలు తీసుకోకపోతే.. ఎమ్మెల్యేలతో కలిసి బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో వెళ్తామనన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత దళితులు, బలహీన వర్గాల భూములను అధికార పార్టీ పెద్దలు గద్దల్లా తన్నుకుపోతున్నారని హరీశ్ రావు మండిపడ్డారు. ఒకవైపు పారిశ్రామిక వేత్తల ముసుగులో, మరోవైపు కబ్జాల రూపంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక తరువాయి 2 వ పేజీలో...



# న్యాయకోవిదులతో నేను..!

## హైకోర్టు నిర్మాణం గొప్ప అవకాశం

### పవిత్ర కార్యం నా అదృష్టం.. సీఎం రేవంత్ రెడ్డి

రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లో తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జోన్-2 నూతన భవన నిర్మాణ పనులకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పి.ఎస్. నరసింహ, జస్టిస్ ఉజ్జల్ భుయాన్ , జస్టిస్ ఎస్. వెంకటనారాయణ భట్టి, జస్టిస్ అలోక్ ఆరాధే పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. '2027 డిసెంబర్ నాటికి తెలంగాణ హైకోర్టు నూతన భవన సముదాయాల నిర్మాణాలను పూర్తి చేస్తాం అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు.

రాజేంద్రనగర్-రంగారెడ్డి, ఏప్రిల్ 5 (ఈవార్తలు): హైకోర్టు కొత్త భవన సముదాయ నిర్మాణంతో పాటు రాష్ట్రంలోని వివిధ నగరాలు, పట్టణాల్లో 49 కోర్టులు, నివాస భవనాల నిర్మాణ ప్రాజెక్టులను కూడా చేపడుతున్నట్టు చెప్పారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లో తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జోన్-×× నూతన భవన నిర్మాణ పనులకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ శంకుస్థాపన -2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,093 |
| వెండి (గ్రాము): | రూ.255 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,915 |



# సరస్వతికి లక్ష్మీ కటాక్షం

### బాసరలో 9 అంతస్తుల రాజగోపురం

### ఈశాన్యంలో కోనేరు.. 3 రెట్లు పెరిగే విస్తీర్ణం

### 225 కోట్లతో ఆలయ పునఃనిర్మాణం

### నేడు పనులకు సీఎం రేవంత్ భూమిపూజ

దక్షిణ భారతదేశంలోని ఏకైక జ్ఞాన సరస్వతి ఆలయం.. అక్షరాభాస్యాలకు ఆలవాలమైన క్షేత్రం పునఃనిర్మాణంతో కొత్త శోభను సంతరించుకోబోతోంది. వేద వ్యాస మహర్షితో ప్రతిష్టతమైన ముగ్గురు అమ్మల ఆలయం ఆచారాలకు అనుగుణంగా సమున్నతమైన రాజగోపురం.. కోనేరు.. ఉత్తర ద్వారం అభివృద్ధి.. ధ్యాన మందిరాలతో మరింతగా భక్తుల మనస్సులను ఆకట్టకోనుంది.

బాసర/ హైదరాబాద్, ఏప్రిల్ 5 (ఈవార్తలు): వేల ఏళ్ల ఘన చరిత్ర గల్గిన బాసర జ్ఞాన సరస్వతి ఆలయ పునః నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.225 కోట్లను కేటాయించింది. పునః నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సోమవారం భూమి పూజ చేయనున్నారు. దక్షిణ గంగగా గుర్తింపు పొందిన పవిత్ర గోదావరి నదీ తీరంలోని బాసర క్షేత్రంలో జ్ఞాన సరస్వతి దేవి కొలువై ఉన్నారు.. కురుక్షేత్ర యుద్ధానంతరం ప్రశాంతత కోసం వేద వ్యాస మహర్షి గోదావరి తీరానికి వచ్చి బాసరలో నివసించారట.. ఆ సమయంలో స్వయంగా ఆయనే గోదావరి ఇసుకతో జ్ఞాన సరస్వతితో పాటు మహా లక్ష్మి, మహా కాళి అమ్మ వార్ల తరువాయి 2 వ పేజీలో...

## గెంటేసిన పార్టీలోకి వెళ్తనా?


### పిచ్చి ప్రచారాలు మానుకోండి

### కరీంనగర్‌లో పోస్టర్లు కుట్ర.. బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్



మేడ్చల్ మల్కాజిగిరి, ఏప్రిల్ 5 (ఈవార్తలు): మాల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పార్టీ మారబోతున్నట్లు గత కొంత కాలంగా ప్రచారం జరుగుతోంది. ఆయన తిరిగి సొంతగూటికి అంటే బీఆర్ఎస్ పార్టీలో చేరనున్నారంటూ కరీంనగర్‌లో పోస్టర్లు ప్రత్యక్షం కావటం కలకలం రేపింది. దీనిపై తాజాగా ఈటల రాజేందర్ స్పందించారు. శామీర్‌పేటలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



ప్రపంచంలోనే తొలి థోరియం న్యూక్లియర్ రియాక్టర్‌ను యాక్టివేట్ చేసింది. అమెరికా శాస్త్రవేత్తలు రూపొందించిన రియాక్టర్‌ను కాపీ కొట్టి, అమెరికా డాక్యుమెంట్లను డీ క్లాసిఫై చేసి ఈ ఘనత సాధించింది.



# తగ్గనంటున్న ఇరాన్


### మరో విమానం కూల్చివేత.. సీ-130 విమానం పేల్చివేత.. అమెరికాకు మరో ఎదురుదెబ్బ

టెహ్రాన్: పశ్చిమాసియా యుద్ధంలో అమెరికాకు మరో ఎదురుదెబ్బ తగిలింది. అమెరికా వైమానిక దళానికి చెందిన రెండు సీ-130 విమానాలను కూల్చేసినట్లు ఇరాన్ రెవెల్యూషనరీ గార్డ్స్ ప్రకటించింది. ఇస్ఫహాన్ ప్రాంతంలో అమెరికాకు చెందిన రెండు సీ-130 విమానాలు, రెండు బ్లాక్ హాక్ హెలికాప్టర్లను కూల్చేసినట్లు ఇరాన్ సైన్యం తరువాయి 2 వ పేజీలో...

# ట్రంప్ ఫ్రస్టేషన్

### ఇరాన్‌పై బూతులు.. అన్నీ పేల్చేస్తామని వార్నింగ్

### ఆస్తులన్నీ ధ్వంసం చేస్తాం.. నేడు ముగియనున్న డెడ్‌లైన్



హర్మూజ్ జలసంధిని తెరిచేందుకు ఇరాన్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన 48 గంటల గడువు మంగళవారంతో ముగియనుంది. ఈ క్రమంలో సోమవారం ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఫాక్స్ న్యూస్ జర్నలిస్ట్ ట్రే యింగ్‌స్ట్‌కు ట్రంప్ టెలిఫోన్ ఇంటర్వ్యూ ఇచ్చారు.

వాషింగ్టన్: ఈ ఇంటర్వ్యూలో.. 'ఇరాన్ ఎలాంటి షరతులు లేకుండా హర్మూజ్ జలసంధిపై విధించిన ఆంక్షల్ని ఎత్తివేయాలి. లేదంటే అన్నింటినీ పేల్చేస్తాం. ఇరాన్ చమురును స్వాధీనం చేసుకుంటామ'ని అన్నారు. అంతే కాదు.. హర్మూజ్ జలసంధంచిన తెరిచేందుకు ప్రయత్నిస్తున్న ఇరాన్ ప్రతినిధులకు పరిమిత క్షమాభిక్ష ప్రసాదించినట్లు తెలిపారు. అయితే, ఒప్పందం కుదరకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని కూడా హెచ్చరించారు. చర్చలు విఫలమైతే, కీలక ఆస్తులను ధ్వంసం చేయడం, ఇరాన్ చమురు వనరులను స్వాధీనం చేసుకోవడంతో సహా కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని తరువాయి 2 వ పేజీలో...

# ఖానాపూర్ పీఠం బీజేపీదే

### వైస్ చైర్మన్‌గా బీఆర్ఎస్ అభ్యర్థి

నిర్మల్ జిల్లా ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్నికపై ఉత్కంఠ వీడింది. ఖానాపూర్ మున్సిపాలిటీ పీఠాన్ని బీజేపీ-బీఆర్ఎస్ కైవసం చేసుకుంది. మున్సిపల్ చైర్‌పర్సన్‌గా బీజేపీ కార్పొరేటర్ మౌనిక ఎన్నికయ్యారు. వైస్ చైర్మన్‌గా బీఆర్ఎస్ మహమ్మద్ షోయబ్ ఎన్నికయ్యారు.

నిర్మల్, ఏప్రిల్ 5 (ఈవార్తలు): చైర్మన్ ఎన్నిక సందర్భంగా శనివారంనాడు కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఎమ్మెల్యే బొజ్జు పటేల్, కాంగ్రెస్ కౌన్సిలర్లు.. అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఆ -2 వ పేజీలో...

## రాశి ఫలాలు

5.4.2026

మేషం: ఆకస్మిక ధనప్రాప్తి కలుగుతుంది. బంధు మిత్రుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. నూతన వ్యాపార ప్రారంభానికి శ్రీకారం చుడతారు. సమాజంలో పెద్దల అనుగ్రహంతో కీలకమైన పనులు పూర్తి చేస్తారు. వృత్తి ఉద్యోగాలలో ఆశించిన పురోగతి సాధిస్తారు.

వృషభం: ప్రయాణ విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి. వృత్తి, వ్యాపారాలలో శ్రమాధిక్యత పెరుగుతుంది. నిరుద్యోగ ప్రయత్నాలు నిదానంగా సాగుతాయి. కీలక విషయాలలో ఆలోచించి ముందుకు సాగాలి. నూతన ఋణ ప్రయత్నాలు కలసిరావు. కుటుంబ సభ్యుల అనారోగ్య సమస్యలు మానసికంగా కొంత చికాకు కలిగిస్తాయి.

మిధునం: చేపట్టిన పనులలో మార్గ అవరోధాలు కలుగుతాయి. అధిక శ్రమతో అల్ప ఫలితం పొందుతారు. ఉద్యోగాలలో అధికారులతో వివాదాలు కలుగుతాయి. మాతృ వర్గ బంధు మిత్రులతో స్థిరాస్తి వివాదాలు కలుగుతాయి. వృత్తి వ్యాపారములలో నష్ట సూచనలున్నవి. కుటుంబ సభ్యులతో పుణ్యక్షేత్రాలు దర్శించుకుంటారు.

కర్కాటకం: చేపట్టిన పనులు ఉత్సాహంగా పూర్తి చేస్తారు. బంధు, మిత్రులతో గృహమున సఖ్యతగా వ్యవహరిస్తారు. వృత్తి ఉద్యోగమున పని ఒత్తిడి నుండి ఉపశమనం పొందుతారు. ఆర్థిక పరిస్థితి మరింత మెరుగుపడుతుంది. నూతన వ్యాపార విస్తరణ ప్రయత్నాలు ఫలిస్తాయి. నిరుద్యోగులకు అనుకూల వాతావరణం ఉంటుంది.

సింహం: నేత్ర సంభందిత సమస్యలు కలుగుతాయి. ముఖ్యమైన వ్యవహారాలు వాయిదా వెయ్యడం మంచిది. వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. ఆర్థిక పరిస్థితి నిరుత్సాహపరుస్తుంది. వృత్తి ఉద్యోగములలో బాధ్యతలు నిర్వహించడంలో లోటుపాట్లు కలుగుతాయి. సోదరులతో స్థిరాస్తి వివాదాలు కలుగుతాయి.

కన్య: ఆర్థిక వ్యవహారాలు ఆశాజనకంగా ఉంటాయి. మొండి బాకీలు ఋణాలు తీర్చగలుగుతారు. కుటుంబ సభ్యులతో దైవ కార్యక్రమాలలో పాల్గొంటారు. అనుకున్న పనులు అనుకున్న సమయానికి పూర్తిచేస్తారు. నిరుద్యోగులకు చాలాకాలంగా ఎదురుచూస్తున్న అవకాశములు అందుతాయి. భాగస్వామ్య వ్యాపారాలకు నూతన పెట్టుబడులు లభిస్తాయి.

తుల: గృహ నిర్మాణ ప్రయత్నాలు వాయిదా వేస్తారు. కీలక వ్యవహారాలలో తీసుకున్న తొందరపాటు నిర్ణయాలు నిరాశ కలిగిస్తాయి. వృత్తి ఉద్యోగాలలో పై అధికారులతో ఊహించని సమస్యలు కలుగుతాయి. సంతాన ఆరోగ్య విషయంలో శ్రద్ధ వహించాలి. ఇంటా బయట సమస్యాత్మక వాతావరణం ఉంటుంది.

వృశ్చికం: చేపట్టిన వ్యవహారాల్లో కార్యసిద్ధి కలుగుతుంది. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. కుటుంబ సభ్యుల ప్రవర్తన కొంత ఆశ్చర్యానికి గురిచేస్తుంది. ఆప్తుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. కొన్ని పనులు అనుకూలంగా పూర్తిచేస్తారు. ఆర్థికంగా వ్యవహారాలు సంతృప్తి కలిగిస్తాయి. వృత్తి,ఉద్యోగాల్లో ఉత్సాహకర వాతావరణం ఉంటుంది.

ధనస్సు: దైవ సేవా కార్యక్రమాలు నిర్వహించి పెద్దల నుండి ప్రశంసలు అందుకుంటారు. వృత్తి, ఉద్యోగాలలో అనుకూలత పెరుగుతుంది. మొండి బాకీలు సకాలంలో వసూలు అవుతాయి. బంధు మిత్రులతో సంతాన వివాహ విషయమై చర్చలు జరుగుతాయి. పాత మిత్రులతో విందు వినోదాది కార్యక్రమాలలో పాల్గొంటారు.

మకరం: ఇతరులతో తొందరపడి మాట్లాడటం మంచిది కాదు. ఆదాయానికి మించి ఖర్చులు పెరుగుతాయి. ఆర్థిక వ్యవహారాలు మరింత నిరాశ కలిగిస్తాయి. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలపై దృష్టి సారిస్తారు. వృత్తి వ్యాపారాలు మందగిస్తాయి. ఉద్యోగాలలో అదనపు పని భారం ఉన్నప్పటికీ నిదానంగా పూర్తి చేస్తారు.

కుంభం: బంధు మిత్రుల నుండి ఊహించని మాటలు వినవలసి వస్తుంది. దూర ప్రయాణాలలో అప్రమత్తంగా వ్యవహరించాలి. దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు చికాకు కలిగిస్తాయి. నిరుద్యోగ ప్రయత్నాలు కలిసిరావు. వృత్తి వ్యాపారాలలో ఆర్థిక సమస్యలు కలుగుతాయి. ఉద్యోగమున సహోద్యోగులతో మాటపట్టింపులు కలుగుతాయి.

మీనం: వ్యాపార విషయమై పెద్దల సలహాలు తీసుకోవడం మంచిది. వృత్తి ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి. చాలాకాలంగా వేధిస్తున్న స్థిరాస్తి వివాదాల నుండి బయటపడతారు. ఆర్థిక విషయంలో ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. విద్యార్థులకు నూతన అవకాశములు లభిస్తాయి. పుణ్యక్షేత్ర దర్శనం చేసుకుంటారు.

# కాంగ్రెస్ గద్దలు



373 ఎకరాల్లో 17 ఎకరాల లచ్చమ్మ కుంట, 6 ఎకరాల బఫర్ జోన్ ఉంది. ఆ చెరువుకు వచ్చే ఫీడర్ ఛానల్స్ అన్నీ ఈ కంపెనీలు ధ్వంసం చేశాయి. లచ్చమ్మ కుంట నిండితే అక్కడి నుంచి నాన్ చెరువు, మగ్రివాని కుంట, రెడ్డి కుంట, సున్నం చెరువు, చివరకు ఇంజాపూర్ మాసం చెరువు వరకు నీళ్లు వెళ్తాయి. ఇంత జరుగుతున్నా హైడ్రా రంగనాథ్ కు ఎందుకు వినిపించడం లేదన్నారు. రేపు ఉదయం కల్లా హైడ్రా రంగనాథ్ అక్కడకు వెళ్లి చర్యలు తీసుకోకపోతే.. ఎమ్మెల్యేలతో కలిసి బీఆర్ఎస్ ఆధ్వర్యంలోనే అక్కడికి వెళ్తాం.

మొదటి పేజీ తరువాయి

భూ కుంభకోణాలకు పాల్పడుతోందన్నారు. నాదర్ గుల్‌లోని సర్వే నంబర్ 613 (కొత్త సర్వే నంబర్ 119)లో ఉన్న 373 ఎకరాల భూమిలో 7 వేల కోట్ల రూపాయల భారీ స్కాం జరుగుతోందన్నారు. ఈ కుంభకోణం వెనుక ప్రభుత్వ పెద్దలు, మంత్రులు ఉన్నారు. రక్షకులే భక్షకులుగా మారారు. ఈ భూములను ప్రభుత్వ భూములుగా డిక్లేర్ చేయాలని ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు లేఖ రాయగా, అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 2008లో వీటిని ప్రభుత్వ భూములుగా అసెంబ్లీలో ప్రకటించి ఏపీఐఐసీకి అప్పగించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ ప్రభుత్వం ఈ భూములను కంటికి రెప్పలా కాపాడితే, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పది రోజుల్లోనే రేవంత్ రెడ్డి కన్ను ఈ భూములపై పడింది. ఈ భూముల్లో 600 మంది పేద రైతులు తాత ముత్తాతల కాలం నుంచి వ్యవసాయం చేసుకుంటున్నారు. ఈరోజు వాళ్లను భూముల్లోకి రానివ్వకుండా బౌన్సర్లను, రౌడీలను పెట్టి పోలీసుల చేత దాడులు చేయించి అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు హరీశ్ రావు. కౌసల్య, మమత లాంటి మహిళా రైతులు 40 ఏళ్లుగా ఈ భూమినే నమ్ముకుని బతుకుతున్నారు. వారికి 5, 10 లక్షలు ఆశచూపి వెళ్లగొట్టాలని చూస్తున్నారు, బోర్లు, కంచెలు ధ్వంసం చేశారు. మహిళలను రౌడీల చేత బెదిరిస్తున్నారు. పేదలకు సాయం చేయాల్సిన పోలీసులు పెద్దలకు వత్తాసు పలుకుతున్నారు. ఈ నాదర్‌గుల్ భూములు తనవని శివరాజ్ బహదూర్ అనే వ్యక్తి నిజాం కాలం నాటి మాటలు చెబుతుండగా, 2005లోనే అప్పటి ఆర్డీవో ఇది ప్రభుత్వ భూమి అని స్పష్టం చేశారు. 2017లో సుప్రీంకోర్టు కూడా ఇది ప్రభుత్వానిదేనని చెప్పింది.

### 373 ఎకరాలు ఉండే అవకాశం లేదు

రాష్ట్రంలో ఉన్న ల్యాండ్ సీలింగ్ చట్టం ప్రకారం ఒక వ్యక్తికి 373 ఎకరాలు ఉండే అవకాశం లేదు. కానీ 2016లో శివరాజ్ బహదూర్ ఈ భూములను ఆల్ఫా, ఒమేగా, యునిటెక్ అనే కంపెనీలకు విక్రయించాడు. చట్టంలోని సెక్షన్ 8, సెక్షన్ 17 ప్రకారం ల్యాండ్ సీలింగ్ డిక్లరేషన్ ఇవ్వకుండా ఈ భూములను అమ్మే హక్కు ఎవరికీ లేదు. ఈ విక్రయాలు చెల్లవని, ఇది సెక్షన్ 22ఏ కింద నిషేధిత జాబితాలో ఉంటుందని కందుకూరు ఆర్డీవో తేల్చిచెప్పారు. ఆర్డీవో నిర్ణయాన్ని సవాల్ చేస్తూ సదరు కంపెనీలు హైకోర్టుకు వెళ్లగా.. ఆర్డీవో నిర్ణయమే సరైనదని, ఈ భూముల క్రయవిక్రయాలు చెల్లవని సింగిల్ బెంచ్ మరియు డివిజన్ బెంచ్ (13-10-2022న) స్పష్టం చేశాయి. అమ్మిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కూడా కోర్టు సూచించింది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ వాళ్లు సుప్రీంకోర్టుకు వెళ్లారు. ప్రస్తుతం జస్టిస్ పంకజ్ మిట్టల్, జస్టిస్ ప్రసన్న ధర్మాసనం వద్ద ఈ కేసు ఏప్రిల్ 7, 2026 విచారణకు పెండింగ్ లో ఉంది. సుప్రీంకోర్టులో వాళ్లకు ఎలాంటి స్టే రాలేదు, కాబట్టి హైకోర్టు తీర్పే ఫైనల్. సుప్రీంకోర్టులో కందుకూరు ఆర్డీవో దాఖలు చేసిన అఫిడవిట్ లోనూ ఇది ప్రభుత్వ భూమి అనే స్పష్టం చేశారు. ఈరోజు ఉదయం భూభారతి వెబ్ సైట్ లో చూసినా ఇది ప్రభుత్వ భూమి ప్రొహిబిటెడ్ ల్యాండ్ గానే చూపిస్తోంది. ఇంత స్పష్టంగా కోర్టు తీర్పులు, చట్టాలు ఉన్నప్పటికీ కస్టోడియన్ గా ఉండి భూములను కాపాడాల్సిన ఆర్డీవో కళ్లు మూసుకున్నారు. మార్చి 9, 10 తేదీల్లో రైతులు కందుకూరు ఆర్డీవోకు, ఎమ్మార్వోకు, రంగారెడ్డి కలెక్టర్‌కు, చివరకు హైడ్రాకు కూడా గుండాల ఆక్రమణలపై వినతిపత్రాలు ఇచ్చారు. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఆనాటి కాంగ్రెస్ ఇందిరమ్మ రాజ్యం పేదలకు వ్యవసాయం చేసుకోవడానికి అవకాశం ఇస్తే.. ఈనాటి రేవంత్ రెడ్డి రాజ్యం గుండాలతో ఆ భూములను గుంజుకుంటోంది. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో గుండాలు, రౌడీలు ఎందుకు రాలేదు? రేవంత్ రెడ్డి రాగానే ఎందుకు వస్తున్నారు..? దీని వెనుక ఉన్న దొంగలు ఎవరో స్పష్టమవుతోంది.

### పేదోడికి ఒక న్యాయం, పెద్దోడికి ఒక న్యాయమా?

పత్రికల్లో వార్తలు వచ్చినా, పేద రైతులు వెళ్లి దరఖాస్తులు ఇచ్చినా హైడ్రా కళ్లు మూసుకుందంటే.. పేదోడికి ఒక న్యాయం, పెద్దోడికి ఒక న్యాయమా..? శని, ఆదివారాలు వస్తే పేదల ఇళ్లు కూలగొట్టే జీవో 99 హైడ్రా.. 7 వేల కోట్ల భూ కుంభకోణాన్ని ఎందుకు ఆపడం లేదు..? అని ప్రశ్నించారు. 'నేను చెరువులను కాపాడుతున్నానని చెప్పే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నాదర్‌గుల్ కబ్జాలు కనిపించడం లేదా..? ఆ

# సరస్వతికి లక్ష్మీ కటాక్షం

మొదటి పేజీ తరువాయి

మూర్తులను ప్రతిష్టించారనేది స్థల పురాణం.. అలా ముగ్గురమ్మల కొలువైన క్షేత్రంగా బాసర ప్రసిద్ధి చెందింది.

### అక్షరాభ్యాసాలతో..

జ్ఞాన సరస్వతి కొలువైన క్షేత్రం కావడంతో ప్రతి ఏటా పెద్ద సంఖ్యలో పిల్లలకు ఇక్కడ అక్షరాభ్యాసాలు చేయిస్తుంటారు. వసంత పంచమి, ఇతర పర్వ దినాల్లో అక్షరాభ్యాసాలకు వచ్చే పిల్లలు, తల్లిదండ్రులు, వారి బంధువులు, భక్తులతో ఆలయం కిటకిటలాడుతుంది. ప్రాచీన ఆలయం కావడం.. ఏటేటా పెరుగుతున్న భక్తుల సంఖ్యకు తగినట్లు అభివృద్ధి పనులు చేపట్టపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.. ఈ నేపథ్యంలో బాసర ఆలయ అభివృద్ధి చేపట్టాలని గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు సంకల్పించారు. సంప్రదాయాలు, ఆచారాలకు అనుగుణంగా ఆలయ అభివృద్ధి పనులు చేపట్టేందుకు మాస్టర్ ప్లాన్ తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. బాసర ఆలయ పునఃనిర్మాణ పనులకు మాస్టర్ ప్లాన్ రూపొందించే ముందు అధికారులు శృంగేరి పీఠాధిపతులతో సంప్రదించారు.. గర్భాలయం, అర్ధ మండపం, రాజ గోపురం, ఇతర గోపురాలు, మాడ వీధులు, కోనేరు, ఉత్తర ద్వారాల నిర్మాణాలకు సంబంధించి పీఠాధిపతుల అనుమతులు తీసుకున్నారు.. వారి సూచనలకు అనుగుణంగా మాస్టర్ ప్లాన్‌ను రూపొందించారు.

### విశాలంగా.. సౌకర్యంగా..

భక్తుల సంఖ్య.. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రస్తుతం 2 వేల చదరపు అడుగుల్లో ఉన్న గర్భాలయం, అర్ధ మండపాన్ని 5 వేల చదరపు అడుగులకు పెంచుతున్నారు. ఉత్తరం వైపున 9 అంతస్తుల రాజగోపురం, మిగిలిన మూడు దిక్కుల్లో 7 అతంస్తుల గోపురాలు, 33 అడుగుల వెడల్పుతో నాలుగు దిక్కుల మాడ వీధులు, ఉత్తర ద్వారం నిర్మించనున్నారు. మొత్తంగా ఆలయ విస్తీర్ణాన్ని 20 వేల చదరపు అడుగుల నుంచి 62 వేల చదరపు అడుగులకు పెంచుతున్నారు. ఆలయంలో ప్రతి నిర్మాణాన్ని శిలలతో చేపట్టనున్నారు. 6 వేల మంది భక్తులకు అన్ని వసతులతో (ఫీడింగ్ రూమ్, ఫుడ్ స్టాల్స్, టాయిలెట్స్ తదితరాలతో) 70 వేల చదరపు అడుగులతో క్యూ కాంప్లెక్సులు, 200 మంది ఏకకాలంలో కూర్చొని ధ్యానం చేసుకునేలా ధ్యాన మందిరం, 20 వేల చదరపు అడుగుల వైశాల్యంతో వంట శాల, భోజన శాలలు, ప్రసాద పంపిణీ కేంద్రం, ఈశాన్య దిక్కున కోనేరు... తూర్పు దిక్కున ఆధ్యాత్మికత పరిఢవిల్లేలా అద్భుతమైన తోరణాలు, సమాచార కేంద్రం, దేవాలయానికి ఉత్తర, తూర్పు దిక్కుల్లో రోడ్ల అభివృద్ధి, దేవాలయం నుంచి ఆవతలి వైపు వెళ్లేందుకు అండర్ పాస్, ఆవతలి వైపున సోలార్ రూఫ్‌టాప్‌తో వాహనాల పార్కింగ్, దేవాలయ ప్రాంగణంలో ఆహ్లాదకరమైన మొక్కలతో పుష్పవనం పనులు చేపట్టనున్నారు. ఆలయ ప్రాంగణం ఆవల హెల్త్ సెంటర్ ఏర్పాటు చేయనున్నారు.. భవిష్యత్‌లో ఆలయం వెనుక భాగం భారీ వృక్షాలతో ఆలరారేలా మొక్కలు నాటనున్నారు.

### నేడు అమ్మవారి దర్శనానికి రేవంత్

బాసర, ఏప్రిల్ 5 (ఈవార్తలు): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 11 గంటలకు నిర్మల్ జిల్లా బాసరలోని శ్రీ జ్ఞాన సరస్వతీ దేవి అమ్మవారిని దర్శించుకొంటారు. మధ్యాహ్నం 12 గంటలకు బాసర ఆలయ విస్తరణ అభివృద్ధి పనులకు సంబంధించి భూమి పూజ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు ఆదిలాబాద్ జిల్లా పిప్రి చేరుకొని, వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. మధ్యాహ్నం 2.30 గంటలకు పిప్రిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు హాజరవుతారు.

# ట్రంప్ ఫ్రస్ట్రేషన్

మొదటి పేజీ తరువాయి

తెలిపారు. ఈ సందర్భంగా సంచలన ఆరోపణలు చేశారు. గతంలో తాము ఇరాన్ నిరసనకారులకు సహాయం చేయాలనే ఉద్దేశంతో వారికి ఆయుధాలు పంపించాం. ఆ ఆయుధాలు నిజంగా నిరసనకారుల చేతికి చేరలేదని, మధ్యలో కుర్దిష్ మార్గాల ద్వారా వెళ్లి.. కుర్దిష్ సమూహాల దగ్గరే ఉండిపోయి ఉండొచ్చనే అనుమానం వ్యక్తం చేశారు. ఇదిలా ఉంటే ట్రంప్ జారీ చేసిన అల్టిమేటం గడువు ముగియనున్న తరుణంలో ఇరాన్ మాత్రం వెనక్కి తగ్గడం లేదు. అమెరికాతో కయ్యానికి కాలు దువ్వుతోంది. ట్రంప్ హెచ్చరికల్ని ఇరాన్ తోసిపుచ్చింది . ఇరాన్ కేంద్ర సైనిక కమాండ్ జనరల్ అలీయాబాది, ట్రంప్ బెదిరింపును నిస్సహాయమైన, ఆందోళనతో కూడిన, అస్థిరమైన, తెలివితక్కువ చర్య అని అన్నారు. ఖతమ్ అల్-అన్బియా సెంట్రల్ హెడ్ క్వార్టర్స్ ప్రతినిధి ఇబ్రహీం జొల్ఫఘారి మాట్లాడుతూ.. శత్రుత్వం పెరిగితే ఇరాన్‌లో మీకు నరకం కనబడుతోంది. ఇరాన్‌ను ఓడించాలన్న మీ భ్రమ ఊబిగా మారి మీరు అందులో కూరుకుపోతారు'అని రెచ్చగొట్టారు.

### తగ్గనంటున్న ఇరాన్

మొదటి పేజీ తరువాయి

వెల్లడించింది. అమెరికాకు చెందిన ఫీ-15ఈ ఫైటర్ జెట్ కూలిపోయిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో అమెరికాకు చెందిన ఓ పైలెట్ గల్లంతు కాగా.. ఆ పైలట్ కోసం అమెరికా రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించింది. ఈ రెస్క్యూ ఆపరేషన్ కోసం దక్షిణ ఇస్ఫహాన్ ప్రావిన్స్‌లోని ఓ మూతపడిన విమానాశ్రయాన్ని అమెరికా ఉపయోగించుకుందని ఇరాన్ సైన్యం వెల్లడించింది. పైలట్‌ను రక్షించే నెపంతో, దక్షిణ ఇస్ఫహాన్‌లోని ఒక మూతపడిన విమానాశ్రయంలో మోసపూరితమైన మిషన్‌ను అమెరికా ప్లాన్ చేసిందన్న ఇరాన్ సైన్యం.. ఈ ఆపరేషన్‌ను పూర్తిగా భగ్నం చేసినట్లు తెలిపింది. ఈ మేరకు ఇరాన్ సైన్యం కేంద్ర కమాండ్ ప్రతినిధి ఖతమ్ అల్ అన్బియా ఇబ్రహీం జొల్ఫఘారి అన్నారు. ఈ ఆపరేషన్‌లో రెండు సీ -130 సైనిక రవాణా విమానాలు, రెండు బ్లాక్ హాక్ హెలికాప్టర్లు ధ్వంసమైనట్లు తెలిపారు. మరోవైపు గల్లంతైన పైలెట్‌ను గుర్తించేందుకు అమెరికా చేపట్టిన రెస్క్యూ ఆపరేషన్‌లో భాగంగా అనేక ఎగిరే వస్తువులను.. ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ ధ్వంసం చేసినట్లు ఆ దేశ మీడియా పేర్కొంది. మరోవైపు గల్లంతైన పైలెట్‌ను తమ దళాలు కాపాడినట్లు ట్రంప్ వెల్లడించారు. మరోవైపు.. దక్షిణ లెబనాన్‌లోని కఫర్ హట్టా ప్రాంతంపై ఆదివారం ఇజ్రాయెల్ జరిపిన దాడిలో ఏడుగురు చనిపోయారు.

# న్యాయకోవిదులతో నేను..!

మొదటి పేజీ తరువాయి

చేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితోపాటు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పి ఎస్ నరసింహ, జస్టిస్ ఉజ్జల్ భుయాన్, జస్టిస్ ఎస్ వెంకటనారాయణ భట్టి , జస్టిస్ అలోక్ ఆరాధే, తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్‌తోపాటు ఇతర న్యాయకోవిదులు పాల్గొన్నారు. '2023 డిసెంబర్‌లో మా ప్రభుత్వం ఏర్పడినప్పుడు తీసుకున్న మొదటి నిర్ణయాల్లో హైకోర్టుకు కొత్త భవన సముదాయాన్ని నిర్మించాలన్న నిర్ణయం ఒకటి. అందుకోసం రాజేంద్రనగర్‌లో 100 ఎకరాలకు పైగా భూమిని కేటాయించాం'అని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. 'భవనాల కోసం జోన్-1లో ఇప్పటికే ప్రారంభించిన పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ రోజు జోన్-2లో నివాస భవనాలకు ఈరోజు శంకుస్థాపన చేసుకున్నాం. వీటి నిర్మాణాలను డిసెంబర్ 2027 నాటికి పూర్తి చేయాలని మా ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది'అని సీఎం చెప్పారు.'న్యాయవ్యవస్థకు అత్యుత్తమ సౌకర్యాలు అందించడం కార్యనిర్వాహక విభాగం బాధ్యతగా భావిస్తున్నాం. ఇక్కడ నిర్మించబోయే భవనం దేశంలోనే అతిపెద్ద హైకోర్టు సముదాయాల్లో ఒకటిగా మాత్రమే కాకుండా, ఆధునికత, మౌలిక వసతుల పరంగా ఒక ప్రమాణంగా నిలుస్తుంది'అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. 'ప్రజాస్వామ్యంలో శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థలు పరస్పర ఆధారపడి, గౌరవంతో పనిచేస్తాయి. సాధారణ పౌరుడు న్యాయం కోసం చివరగా ఆశ్రయించేది న్యాయస్థానాన్నే. అలాంటి న్యాయస్థానానికి కావలసిన భవన నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొనడం జీవితంలో నాకు లభించిన ఒక గొప్ప అవకాశంగా భావిస్తా'అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. 'కొత్తగా నిర్మించే హైకోర్టు సమాజానికి, ప్రజాస్వామ్యానికి ఒక ప్రతీకగా నిలుస్తుంది. ఇది పేదలు, బలహీనులు న్యాయం కోసం వచ్చే వారికి వేదికగా నిలుస్తుంది. రాబోయే వంద సంవత్సరాల పాటు పేదలు, బలహీనులు, అణగారిన వర్గాలు న్యాయం కోసం ఈ మందిరానికి వస్తారు''దేశంలో ఒక దేవాలయం, మసీదు, చర్చి, గురుద్వారా నిర్మించడం గొప్ప విషయం.

# సిమెంట్ ధరలు పైపైకి

మొదటి పేజీ తరువాయి

సంస్థలు ఇప్పటికే పెంచాలని నిర్ణయించగా, ఇతర కంపెనీలు కూడా ఇదే బాటలో నడిచే అవకాశం ఉంది. ఈక్విరస్ నివేదిక ప్రకారం, మధ్యప్రాచ్య యుద్ధం వల్ల ఏర్పడిన సవాళ్ల మధ్య దేశవ్యాప్తంగా సిమెంట్ తయారీ కంపెనీలు జూన్ త్రైమాసికానికి సంబంధించి లాభాల మార్జిన్లు దెబ్బతింటాయని భావిస్తున్నాయి. ముడిసరుకులు సహా ఇతర ఖర్చులను వినియోగదారులకు బదిలీ చేయడకుండా ఎక్కువ రోజుకు కొనసాగించలేమని, ఇప్పటికే విపరీతంగా పెరిగిన ఇంధన ధరలు, ప్యాకేజింగ్ ఖర్చులను భరించడం కష్టంగా ఉందని కంపెనీ స్పష్టం చేస్తున్నాయి. ఈ ప్రభావం తెలుగు రాష్ట్రాలపైనా ఉండనుంది. దీనివల్ల 50 కిలోల సిమెంట్ బస్తాపై రూ.40-50 వరకు పెరిగే అవకాశాలు ఉన్నాయని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ పెంపు మరో వారం రోజుల్లో ఉండవచ్చని, దీని గురించి సంకేతాలు అందినట్లు రిటైల్ డీలర్లు పేర్కొన్నారు.

# అమూల్ లక్ష కోట్ల యాపారం

మొదటి పేజీ తరువాయి

లక్ష కోట్లు దాటింది. అమూల్.. దేశంలో టాప్ డైరీ బ్రాండ్‌గా కొనసాగుతోంది. ఈ సంస్థ దాదాపు 1,200 రకాల ఉత్పత్తుల్ని మార్కెటింగ్ చేస్తోంది. ఆధునిక వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు తన మార్కెటింగ్ వ్యూహాల్ని మార్చుకుంటూ వస్తోంది. ఈ ఫెడరేషన్‌లో 18 జిల్లా కో ఆపరేటివ్ సంస్థలు కూడా సభ్యత్వం కలిగి ఉన్నాయి. భారీ లక్ష్యన్ని చేరుకున్న సందర్భంగా జీసీఎంఎంఎఫ్ ఛైర్మన్ అశోక్‌భాయ్ చౌదరి స్పందించారు. లక్షలాది మంది వినియోగదారులు, నిరంతరం శ్రమించే 36 లక్షల మంది రైతుల నమ్మకం కారణంగా ఈ విజయం సాధ్యమైందన్నారు. జీసీఎంఎంఎ సంస్థ దేశంలోనే కాకుండా అంతర్జాతీయంగా కూడా అతిపెద్ద డైరీ సంస్థ. ఇందులో 36 లక్షల మంది రైతులు సభ్యులుగా ఉన్నారు.

# 5 కిలోల సిలిండర్లకు మస్తు గిరాకీ

మొదటి పేజీ తరువాయి

నుంచి వీటిని తీసుకోవచ్చని తెలిపింది. మరోవైపు అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్‌పై అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారని, మార్చి నుంచి 50 వేలకు పైగా దాచివుంచిన సిలిండర్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పింది. 'ఏప్రిల్ నాలుగో తేదీన దేశవ్యాప్తంగా ఐదు కిలోల సిలిండర్లు 90 వేలు అమ్ముడయ్యాయి. మార్చి 23 నుంచి ఇప్పటివరకు మొత్తంగా 6.6లక్షల సిలిండర్లు 'సేల్ అయ్యాయి' అని ఇంధన మంత్రిత్వశాఖ వెల్లడించింది. మరోవైపు, డిస్ట్రిబ్యూటర్ల వద్ద ఎటువంటి కొరత లేదని, ఒక్క రోజే 51లక్షల సిలిండర్లు డెలివరీ చేశామని పేర్కొంది. ఆన్‌లైన్‌లోనే 95శాతం బుకింగ్ జరిగిందని తెలిపింది.

# గెంటేసిన పార్టీలోకి వెళ్తనా?

మొదటి పేజీ తరువాయి

సమావేశంలో మ్లాట్లాడిన ఆయన.. పార్టీ మార్పు ప్రచారంపై క్లారిటీ ఇచ్చారు. తాను పార్టీ మారే పరిస్థితి లేదని.. పార్టీలు మారడం దుస్తులు మార్చినంత సులభం కాదని అన్నారు. ఎలాంటి తప్పు చేయకున్నా బీఆర్ఎస్ మెడలు పట్టి బయటకు గెంటేసిందన్నారు. అలాంటి పార్టీలోకి మళ్లీ వెళుతున్నానని పిచ్చి ప్రచారాలు చేస్తున్న వారికి ఇదే తన సమాధానమన్నారు. ఈటల పార్టీ మారుతున్నారని కరీంనగర్‌లో కొందరు పోస్టర్లు వేయటం.. ఆరోపణలు చేయడం తనను బాధించిందన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పార్టీలు మారే పరిస్థితి రాదని చెప్పారు. 'కేసీఆర్ బీఆర్ఎస్ నుంచి పంపించి ఐదేళ్లు అవుతుంది. నాతో పాటు జీవన్ రెడ్డి, బొడిగె శోభ బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారంటూ కొంతమంది పోస్టర్లు అంటిస్తున్నారు. పార్టీలు మారటం బట్టలు మార్చినంత ఈజీ కాదు. నా గురుంచి తెలంగాణ సమాజానికి తెలుసు. నేను ఇరవై ఏళ్ల పాటు బీఆర్ఎస్‌లో ఉన్నా.. దీంతో సహజంగానే ఆ పార్టీలోని నేతలతో నాకు పరిచయాలు ఉంటాయి.

# ఖానాపూర్ పీఠం బీజేపీదే

మొదటి పేజీ తరువాయి

సమయంలో సమావేశం మధ్యలోనే ఎమ్మెల్యే బయటకు వెళ్లిపోయారు. దీంతో అధికారులపై ఎమ్మెల్యే బెదిరింపులకు పాల్పడుతున్నారని బీజేపీ, బీఆర్ఎస్ సభ్యులు ఆగ్రహించారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట ఎమ్మెల్యే వ్యతిరేక నినాదాలతో ఆందోళన చేపట్టారు. ఖానాపూర్ మున్సిపాలిటీలో మొత్తం 12 కౌన్సిలర్ స్థానాలు ఉండగా.. ఇటీవల జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ - 4, బీజేపీ - 4, కాంగ్రెస్ - 3 స్థానాల్లో గెలుపొందగా.. స్వతంత్ర అభ్యర్థి ఒక స్థానాన్ని కైవసం చేసుకున్నారు. స్వతంత్ర అభ్యర్థి, ఎక్స్ అఫీషియో ఓటుతో కాంగ్రెస్ బలం ఐదుకు పెరిగింది. దీంతో ముందుగా ఛైర్మన్ ఎన్నిక వేళ బీజేపీ అభ్యర్థిగా మౌనిక పేరును అధికారులు ప్రతిపాదించారు. దీనిపై ఎమ్మెల్యే బొజ్జు అభ్యంతరం వ్యక్తం చేశారు. ముందుగా ఆమె పేరును ప్రతిపాదించడాన్ని తప్పుబడుతూ ఆయన ఆందోళనకు దిగారు. ఈ గందరగోళం మధ్య ఛైర్మన్ ఎన్నికను అధికారులు ఆదివారానికి వాయిదా వేసిన సంగతి తెలిసిందే.






# గ్రౌండ్ వీడుతున్న యువత

## ప్రమాదకరంగా భవిష్యత్తు.. యువతను సరైన మార్గంలో పెట్టాలి.. సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 5 (ఈవార్తలు): దేశంలోని యువత క్రీడా మైదానాలను ఎందుకు వదిలేసిందన్న అంశంపై ప్రతి ఒక్కరూ ఆలోచించాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. యువతను సరైన మార్గంలో పెట్టకపోతే దేశం ప్రమాదకర పరిస్థితులకు నెట్టివేయబడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో తెలంగాణ పోలీసు శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న 74వ బోలానాథ్ ముల్లిక్ స్మారక ఆల్ ఇండియా పోలీస్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ 2026 ముగింపు కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేశం నలుమూలల నుంచి వివిధ విభాగాలకు చెందిన పోలీసు క్రీడాకారులను ఉద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగించారు. "యువత నెమ్మదిగా క్రీడలకు దూరమవుతున్నారు. క్రీడా మైదానాలను వదిలిపెట్టి యువత తప్పు చేస్తున్నారు. దేశం కోసం ఏమైనా చేయడానికి మనందరం సిద్ధంగా ఉండాలి. యువత సరైన దశలో వెళ్లకపోతే భవిష్యత్తు ప్రమాదకరంగా మారుతుంది అని హెచ్చరించారు. క్రీడాకారులను ప్రోత్సహించడానికి తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలుగా సిద్ధంగా ఉంది. క్రీడాకారులను తయారు చేసి దేశ ప్రతిష్టను నిలబెట్టాలి. యువతను క్రీడల్లో ప్రోత్సహించండి అని పిలుపునిచ్చారు. 'భారత్ ఫుట్‌బాల్ చరిత్రలో హైదరాబాద్ నగరానికి విశేష పేరు ప్రఖ్యాతులున్నాయి. 1950-60 దశకంలో నర్సరీ ఆఫ్ ఇండియన్ ఫుట్‌బాల్‌గా హైదరాబాద్ పేరు గడించింది. దేశంలోనే ఫుట్‌బాల్‌ను అంతగా ఆదరించింది. 1956 ఒలంపిక్స్‌లో ఆడిన ఫుట్‌బాల్ జట్టులో ఏడుగురు క్రీడాకారులు హైదరాబాద్‌కు చెందిన వారే. ఆ క్రమంలో ఆల్ ఇండియా పోలీస్ ఫుట్‌బాల్ చాంపియన్ షిప్ హైదరాబాద్‌లో నిర్వహించడం గర్వంగా ఉంది. ఈ క్రీడల నిర్వహణ ద్వారా తెలంగాణ రాష్ట్రానికి మంచి పేరు తెచ్చిన పోలీసు విభాగానికి మనస్ఫూర్తిగా అభినందనలు. దేశం నలుమూలల నుంచి ఈ క్రీడల్లో పాల్గొని అద్భుతమైన నైపుణ్యం ప్రదర్శించిన టీమ్‌లకు తెలంగాణ ముఖ్యమంత్రిగా అందరికీ అభినందనలు. 140 కోట్ల జనాభా కలిగిన భారత్ ఒలింపిక్స్‌లో కనీసం ఒక్క గోల్డ్ మెడల్ కూడా సాధించలేకపోవడం గురించి ప్రతి ఒక్కరూ ఆలోచించాలి. గతంలో ఇదే గచ్చిబౌలీలో ఎన్నో క్రీడలు నిర్వహించాం. గడిచిన కొన్నేళ్లుగా పట్టించుకోలేదు. అంతర్జాతీయ స్థాయిలో క్రీడల్లో మనవాళ్లు ఓడిపోగానే కొద్దిరోజులు చర్చించి ఆ తర్వాత విస్మరిస్తున్నారు. యువత మాదక ద్రవ్యాల వలలో పడి నిర్వీర్యమైపోతోంది. వీరుల భూమి, ఎంతోమంది త్యాగధనులకు కేంద్రమైన పంజాబ్‌లో ఈరోజు మాదకద్రవ్యాల గురించి వినిపిస్తోంది. అందుకే ఆలోచించి తెలంగాణ ప్రభుత్వం ఒక అడుగు ముందుకేసింది. ఎంతో మంది నిష్ణాతులతో కలిసి



రాష్ట్రంలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని నెలకొల్పాం. క్రీడల్లో రాణించిన వారికి అన్ని విధాలుగా ప్రోత్సహించడానికి మా ప్రభుత్వం సిద్ధంగా ఉంటుంది. సైబర్ క్రైమ్, మాదక ద్రవ్యాలతో సమాజంలో సరికొత్త సవాళ్లు ఎదురవుతున్నాయి. పోలీసు విభాగాలకు చెందిన క్రీడాకారులు మైదానాల్లో ఎలాగైతే ప్రతిభను, స్ఫూర్తిని కనబరిచారో సైబర్ క్రైమ్, మాదక ద్రవ్యాల నియంత్రణలో కూడా ప్రతిభను కనబరచాలి' అని ముఖ్యమంత్రి నొక్కి చెప్పారు. మార్చి 25 నుంచి ఏప్రిల్ 5 వరకు జాతీయ స్థాయిలో నిర్వహించిన ఈ చాంపియన్ షిప్, ముగింపు కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి, డీజీపీ శివధర్ రెడ్డి, తెలంగాణ స్పోర్ట్స్ అకాడమీ చైర్మన్ శివసేనా రెడ్డి, సీఐడీ డీజీ శిఖా గోయల్, ఆల్ ఇండియా పోలీస్ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డు డైరెక్టర్, ఇంటెలిజెన్స్ బ్యూరో స్పెషల్ డైరెక్టర్ స్వప్న తివారి, తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్, సైబరాబాద్ సీపీ రమేష్ రెడ్డితో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి స్వయంగా మైదానంలో మ్యాచ్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ చాంపియన్‌షిప్‌లో ప్రతిభ కనబరిచిన టీమ్‌లకు ట్రోఫీలను అందించారు.


## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.


## రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులుకు పూలే ఎక్సలెన్స్ అవార్డు

హైదరాబాద్, ఏప్రిల్5 (ఈవార్తలు): బీసీల హక్కులు, అభ్యున్నతికి నిర్విరామంగా కృషి చేస్తున్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, బీసీ మేధావుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు టీ చిరంజీవులును పూలే ఎక్సలెన్స్ అవార్డు 2026కు ఎంపిక చేశారు. ఈ మేరకు తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. రవీంద్రభారతిలో 10న నిర్వహించబోయే మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకల్లో ఈ అవార్డు ప్రదానం చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో శాసనమండలిలో ప్రతిపక్ష నేత సీహెచ్ మధుసూదనాచారి, ఎంపీ ఈటల రాజేందర్, తదితరులు పాల్గొంటారని వెల్లడించారు.

## స్కూటీని ఢీకొట్టి కిలోమీటర్ ఈడ్చుకెళ్లిన డీసీఎం

**హైదరాబాద్‌లో ఘోరం.. మహిళ మృతి**

మాదాపూర్-హైదరాబాద్, ఏప్రిల్ 5 (ఈవార్తలు): హైదరాబాద్ ఐటీ హబ్ మాదాపూర్‌లో శనివారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఓ డీసీఎం వాహనం స్కూటీపై వెళుతున్న దంపతులను వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో స్కూటీ వెనుక కూర్చున్న మహిళ వాహనం కింద చిక్కుకోగా, డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా దాదాపు కిలోమీటర్ దూరం ఈడ్చుకెళ్లాడు. ఈ దుర్ఘటనలో హనియా ఆయేషా (22) అనే యువతి అక్కడికక్కడే మృతి చెందగా, ఆమె భర్త అబ్దుల్ బాసిత్ (26) తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం కేరళకు చెందిన ఈ దంపతులు నగరంలోని మలబార్ గోల్డ్ స్టోర్‌లో పనిచేస్తున్నారు. శనివారం రాత్రి కూకట్‌పల్లిలో సినిమా చూసి తిరిగి మహేశ్వరంలోని తమ ఇంటికి వెళ్తుండగా మైండ్‌స్పేస్ వద్ద ఈ ప్రమాదం జరిగింది. డీసీఎం ఢీకొన్న వేగానికి అబ్దుల్ బాసిత్ రోడ్డు పక్కన పడిపోగా, ఆయేషా స్కూటీతో పాటు డీసీఎం కింద చిక్కుకుంది. వాహనం కింద నుంచి మంటలు, అరుపులు వస్తున్నా డ్రైవర్ వాహనాన్ని ఆపలేదు. ఇది గమనించిన స్థానికులు, ఇతర వాహనదారులు డీసీఎంను వెంబడించి అడ్డుకున్నారు. వెంటనే డ్రైవర్ అక్కడి నుంచి పరారవ్వగా, క్లీనర్‌ను పట్టుకున్న జనం దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులను ఏఐజీ ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే ఆయేషా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అబ్దుల్ బాసిత్‌కు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స అందిస్తున్నారు. కర్ణాటక రిజిస్ట్రేషన్ ఉన్న ఈ వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.



## క్యాటగిరీ-4లోకి మరమగ్గాలు


**25 హెచ్‌పీలోపు ఉన్న పవర్‌లూమ్స్‌కు సబ్సిడీ**

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 5 (ఈవార్తలు): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సిఫారసులతో ఎట్టకేలకు రాజన్న సిరిసిల్ల జిల్లాలోని పవర్‌లూమ్ పరిశ్రమలకు భారీ ఊరట కలిగింది. 25 హెచ్‌పీలోపు సామర్థ్యమున్న పవర్‌లూమ్, ఎస్ఎస్ఐ యూనిట్లను క్యాటగిరీ-3 నుంచి క్యాటగిరీ-4లోకి మార్చి విద్యుత్తు సబ్సిడీ అందేలా చూస్తామని జిల్లా ఎస్ఈ భిక్షపతి ప్రకటించారు. పవర్‌లూమ్ పరిశ్రమలకు విద్యుత్తు సబ్సిడీలను కొనసాగించాలని, అందులో భాగంగా 30 హెచ్‌పీలోపు సామర్థ్యమున్న యూనిట్లను క్యాటగిరీ-4లో చేర్చాలని కేటీఆర్ గత సెస్ బహిరంగ సభలో ఈఆర్సీ చైర్మన్‌కు సూచించడంతోపాటు ఇదే విషయమై ఇటీవలే అసెంబ్లీ సమావేశాల్లో ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు విజ్ఞప్తి చేశారు. సిరిసిల్లలోని వస్త్ర పరిశ్రమలపై ఉన్న రూ.38 కోట్ల బ్యాక్ బిల్లింగ్, సర్‌చార్జీలను రద్దు చేయాలని కోరారు. దీంతో ఏప్రిల్ 1 నుంచి సెస్‌ను ఆధీనంలోకి తీసుకున్న టీజీఎన్పీడీసీఎల్ అధికారులు.. 25 హెచ్‌పీలోపు సామర్థ్యమున్న పవర్‌లూమ్ యూనిట్లతోపాటు చిన్న పరిశ్రమ (ఎస్ఎస్ఐ)లను సైతం క్యాటగిరీ-4లోకి మార్చి విద్యుత్తు బిల్లులు అందజేస్తామని వెల్లడించారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం 5 నుంచి 25 హెచ్‌పీ సామర్థ్యమున్న పవర్‌లూమ్ పరిశ్రమలకు సబ్సిడీ పెంచడంతో కార్మికులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిరంతరం ఉపాధి పొందారు. ప్రభుత్వ ఆర్డర్లతోపాటు బతుకమ్మ చీరలు, ప్రైవేట్ ఆర్డర్లతో రంది లేకుండా పనిచేసుకున్నారు. కానీ, ఎస్ఎస్ఐ యూనిట్లకు విద్యుత్తు సబ్సిడీ ఇవ్వకూడదని 2022లో ఓ వ్యక్తి కోర్టుకు వెళ్లడంతో క్యాటగిరీ-3 కింద సబ్సిడీ వర్తించదని తీర్పు వచ్చింది. ఆ క్రమంలో 2016 నుంచి 2024 వరకు బ్యాక్ బిల్లింగ్, సర్‌చార్జీ కలిపి రూ.19 కోట్ల విద్యుత్తు బకాయిలు ఉన్నట్టు సెస్ అధికారులు తేల్చడంతో 127 ఎస్ఎస్ఐ యూనిట్లపై భారం పడింది. దీంతో పలు యూనిట్లు మూతబడ్డాయి. ప్రస్తుతం సర్‌చార్జీతో కలిపి బకాయిలు రూ.38 కోట్లకు చేరాయి.


## తెలంగాణ అంటే ఆత్మగౌరవం: కేటీఆర్

న్యూయార్క్: అమెరికాలోని కొలంబియా బిజినెస్ స్కూల్‌లో ఇండియా బిజినెస్ కాన్ఫరెన్స్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన తెలంగాణ సాధించిన అద్భుత ప్రగతిని వివరించారు. కేసీఆర్ నాయకత్వంలో ఆర్థిక వృద్ధిలో దేశానికి తెలంగాణ దిక్సూచి అని తెలిపారు. తెలంగాణ ప్రస్థానం అంటే ఆత్మగౌరవం, ఆకాంక్ష అని పేర్కొన్నారు. తాము అధికారంలో ఉన్నప్పుడు తెలంగాణ అభివృద్ధికి అవకాశాల కోసం ఎదురుచూడలేదని కేటీఆర్ తెలిపారు. అద్భుతమైన పాలసీలు తయారుచేశామని.. మౌలిక సదుపాయాలు కల్పించామని పేర్కొన్నారు. పెట్టుబడిదారుల్లో నమ్మకాన్ని కలిగించి వృద్ధి సాధించామని చెప్పారు. పదేళ్లలోనే తెలంగాణ సాధించిన ఆర్థిక ప్రగతి గర్వకారణమని కొనియాడారు. ఐటీ, పారిశ్రామిక రంగంలో తెలంగాణ అద్భుత ప్రగతి సాధించిందని తెలిపారు. ఐటీ ఎగుమతులు 2.72 లక్షల కోట్లకు పెరిగాయన్నారు. ఐటీ ఉద్యోగుల సంఖ్య దాదాపు 10 లక్షలకు చేరుకుందని తెలిపారు. తమ పాలనలో హైదరాబాద్ గ్లోబల్ ఐటీ దిగ్గజాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిందని కేటీఆర్ తెలిపారు. అమెజాన్ హైదరాబాద్‌లో అతిపెద్ద క్యాంపస్‌ను ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. ఆవిష్కరణలకు చిరునామాగా తెలంగాణ మారిందని చెప్పారు.

## డ్రైవింగ్ లైసెన్స్‌కు కొత్త నిబంధన



హైదరాబాద్, ఏప్రిల్ 5 (ఈవార్తలు): రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా తెలంగాణలో డ్రైవింగ్ లైసెన్స్ జారీ ప్రక్రియను కఠినతరం చేయనున్నారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా రాష్ట్ర రవాణా శాఖ ఈ మేరకు కీలక మార్పులకు శ్రీకారం చుట్టింది. ఇకపై లెర్నర్స్ లైసెన్స్ (ఎల్ఎల్ఆర్) కోసం దరఖాస్తు చేసుకునే ముందే అభ్యర్థులు తప్పనిసరిగా రోడ్డు భద్రతపై ఆన్‌లైన్ అవగాహన పరీక్షలో ఉత్తీర్ణులు కావాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఉన్న రెండంచెల విధానం (ఎల్ఎల్ఆర్, ఫైనల్ టెస్ట్) ఇకపై మూడంచెలుగా మారనుంది. ఇందులో భాగంగా, అభ్యర్థి మొదట ఆన్‌లైన్ రోడ్డు భద్రతా శిక్షణా కోర్సును పూర్తిచేయాలి. ఈ విధానంపై అధ్యయనానికి ఇప్పటికే ఒక కమిటీని ఏర్పాటు చేశామని, ఏప్రిల్ నెలాఖరు నాటికి నివేదిక రాగానే దీన్ని తప్పనిసరి చేస్తామని రవాణా శాఖ జాయింట్ కమిషనర్ ఎం. చంద్రశేఖర్ గౌడ్ తెలిపారు. ఈ ఆన్‌లైన్ శిక్షణ మొత్తం 3 గంటల నిడివితో, ఆరు మాడ్యూల్స్‌గా ఉంటుంది. ఇందులో వీడియో పాఠాలు, ట్రాఫిక్ నిబంధనలు, సురక్షితమైన డ్రైవింగ్ పద్ధతులపై అవగాహన కల్పిస్తారు. అద్దాల సరైన వినియోగం, సురక్షితంగా ఓవర్‌టేకింగ్ చేయడం వంటి అంశాలతో పాటు, వాస్తవ ప్రమాదాల వీడియోలను చూపిస్తూ డ్రైవర్లు చేసే పొరపాట్లను వివరిస్తారు. అభ్యర్థులు ఇంటి నుంచే కెమెరా ఉన్న కంప్యూటర్ ద్వారా లేదా గుర్తింపు పొందిన డ్రైవింగ్ స్కూళ్లలో ఈ పరీక్ష రాయవచ్చు. ఈ ఆన్‌లైన్ కోర్సు పూర్తి చేసిన వారికి ఒక యూనిక్ సర్టిఫికేట్ నంబర్ జారీ చేస్తారు. ఆ నంబర్‌తో మాత్రమే ఎల్ఎల్ఆర్ కోసం దరఖాస్తు చేసుకోవడానికి వీలవుతుంది. ఈ విధానం ద్వారా బాధ్యతాయుతమైన డ్రైవర్లను తయారు చేయవచ్చని, రవాణా కార్యాలయాల్లో దళారీల ప్రమేయాన్ని తగ్గించి పారదర్శకత పెంచవచ్చని అధికారులు భావిస్తున్నారు. దేశవ్యాప్తంగా ఏటా సుమారు 1.7 లక్షల మంది రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్న నేపథ్యంలో ఈ మార్పులకు ప్రాధాన్యం ఏర్పడింది.

# కొండగట్టు ఈవోకు వేములవాడ అదనపు బాధ్యతలు



మల్యాల, ఏప్రిల్ 5 (ఈవార్తలు): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థాన ఆలయ ఈవో ఎల్ రమాదేవి సెలవులపై వెళ్లిన నేపథ్యంలో, కొండగట్టు ఆంజనేయ స్వామి దేవస్థానం ఈవో అంజనా రెడ్డికి ఇన్‌చార్జ్ ఈవోగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఎండోమెంట్స్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇన్‌చార్జ్ ఈవోగా బాధ్యతలు స్వీకరించేందుకు ఆలయానికి చేరుకున్న అంజనారెడ్డి.. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు, వేద పండితులు ఆయనకు ఆశీర్వచనాలు అందజేశారు.



# ఆపతిలో సోపతులు

మానకొండూర్, ఏప్రిల్ 5 (ఈవార్తలు): కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ స్కూల్‌లో చదువుకున్న 10వ తరగతి (2001-2002) మిత్రులు ఔదార్యం చాటుకున్నారు. తనతో చదువుకున్న (గూడెపు శ్రీనివాస్) మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం చేసి శభాష్ అనిపించుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని గట్టెపల్లి గ్రామానికి చెందిన గూడెపు కొమురయ్య ఇటీవల అనార్యోగ్యంతో మరణించారు. మృతుడు పేద కుటుంబానికి చెందిన వ్యక్తి కావడంతో అతని భార్య, ఇద్దరు కొడుకులకు ఆర్థికసాయం చేయాలని శ్రీనివాస్‌తో చదువుకున్న 10వ తరగతి మిత్రులు నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగానే తలా ఓ చేయి వేసి కొంత మొత్తాన్ని జమచేశారు. జమయిన ఈ మొత్తాన్ని తన కొడుకుల సమక్షంలో మృతుడి భార్య లక్ష్మికి అందించారు. ఈ సందర్భంగా గూడెపు శ్రీనివాస్ మాట్లాడుతూ... ఆపతిలో ఉన్న మా కుటుంబానికి నా పదవ తరగతి సోపతులు మేమున్నామని భరోసా ఇవ్వడం నాకు కొండంత ధైర్యాన్ని ఇచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో గడ్డం సతీష్, గాలి రవీందర్, నందగిరి కిరణ్, కాంపెల్లి రాజ్‌కుమార్, అమ్ముల శంకర్, తాటిపాముల శ్రీశైలం, కొత్తకొండ రామ్‌లక్ష్మణ్, గోపాల సదయ్య, గూడెపు ఐలేశ్, ఓదెలు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా పిఠాపురం భాష్యం క్రిస్టల్ జూబ్లీ

కాకినాడ, ఏప్రిల్ 5 (ఈవార్తలు): ఏపీలోని కాకినాడ జిల్లా పిఠాపురం భాష్యం పాఠశాలలో ఘనంగా వార్షికోత్సవ సమ్మేళనం 15 ఏళ్ల విజయ గాథ క్రిస్టల్ జూబ్లీని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ కమిషనర్ ఎన్ కనకరావు, పిఠాపురం సీఐ జీ శ్రీనివాస్ విచ్చేసి విద్యార్థులకు ప్రేరణాత్మక సందేశాలు అందించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ కనకారావు మాట్లాడుతూ పిఠాపురంలో పరిశుభ్రత ప్రాముఖ్యతను వివరించి, పాఠశాల ద్వారా శానిటేషన్‌పై ర్యాలీ నిర్వహించాలని సూచించారు. సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ యువతలో డ్రగ్స్ ప్రమాదాలపై అవగాహన కల్పిస్తూ, తల్లిదండ్రులు పిల్లలపై మరింత శ్రద్ధ వహించాలని సూచించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకోగా, అకాడమిక్, ఉత్తమ హాజరు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. చివరగా ఈ విజయవంతమైన కార్యక్రమానికి సహకరించిన చైర్మన్ భాష్యం రామకృష్ణ, వైస్ చైర్మన్ హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ సాకేత్ రామ్ కు ప్రిన్సిపాల్ పీ వేణు, ప్రైమరీ హెచ్ఎం అరుణ కృతజ్ఞతలు తెలిపారు కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులకు పట్టణ ప్రముఖులు అధిక సంఖ్యలో విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## జగ్గంపేటలో నారాయణమూర్తికి ఘన సన్మానం

కాకినాడ, ఏప్రిల్ 5 (ఈవార్తలు): ఏపీలోని కాకినాడ జిల్లా జగ్గంపేట నియోజకవర్గంలోని కొడవలి గ్రామానికి చెందిన రాష్ట్ర యాదవ సంఘం కార్పొరేషన్ డైరెక్టర్ నారాయణమూర్తి కి ఘన సన్మానం జరిగింది. ఈ కార్యక్రమం స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు, యాదవ సంఘం ప్రతినిధులు మరియు అభిమానుల సమక్షంలో ఉత్సాహంగా నిర్వహించారు. రాష్ట్ర స్థాయిలో యాదవ సమాజ అభివృద్ధికి నారాయణమూర్తి చేస్తున్న విశిష్ట సేవలను కొనియాడుతూ పలువురు ప్రముఖులు ఆయనకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన వక్తలు, ఆయన కృషి వల్ల యాదవులకు మంచి గుర్తింపు లభించిందని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఆయన ఇలాంటి సేవలు కొనసాగించాలని ఆకాంక్షించారు. సన్మానం అనంతరం నారాయణమూర్తి మాట్లాడుతూ, తనపై చూపిన అభిమానానికి కృతజ్ఞతలు తెలిపారు. యాదవుల సంక్షేమం, అభివృద్ధి కోసం తాను నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో యాదవ సంఘం సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొని విజయవంతం చేశారు.




## రిక్షా యూనియన్ ఆధ్వర్యంలో జగ్జీవన్ రామ్ జయంతి

కాకినాడ, ఏప్రిల్ 5 (ఈవార్తలు): ఏపీలోని కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణం ఉప్పాడ బస్టాండ్ నందు పిఠాపురం ఉప్పాడ బస్టాండ్ రిక్షా యూనియన్ సిఐటియు అనుబంధ సంస్థ టౌన్ రిక్షా యూనియన్ ప్రెసిడెంట్ సత్యనారాయణ ఆధ్వర్యంలో 118 వ బాబు జగజీవన్ రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టౌన్ రిక్షా యూనియన్ ప్రెసిడెంట్ సత్యనారాయణ మాట్లాడుతూ 118 వ బాబు జగజీవన్ రామ్ జయంతిని పురస్కరించుకొని చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో టౌన్ రిక్షా యూనియన్ ప్రెసిడెంట్ పెద్దిపాటి సత్యనారాయణ, కొత్త శ్రీను, బ్యాంక్ దొర, సోమారెడ్డి, 9వ వార్డ్ కౌన్సిలర్ పెద్దవాటి నాగేశ్వరరావు, కోనేటి రాజు, ఎస్వి శ్రీకాంత్, పట్టణ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# కైకలూరు వద్ద కరాటే కల్యాణి అరెస్ట్



ఆకివీడు, ఏప్రిల్ 5 (ఈవార్తలు): ఏపీలోని పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు పట్టణంలో ఆదివారం తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. వివాదాస్పదంగా ఉన్న ఒక కట్టడం వద్ద రామాలయం నిర్మించాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోకి ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించిన పలు హిందూ సంఘాల నేతలను, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హిందూ, దళిత వర్గాల మధ్య నెలకొన్న వివాదం నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పట్టణంలో భారీగా పోలీసు బలగాలను మోహరించారు. పట్టణంలో 144 సెక్షన్ విధిస్తూ ఉన్నతాధికారులు నిషేధాజ్ఞలు జారీ చేశారు. ఎలాంటి ర్యాలీలకు, సభలకు అనుమతి లేదని పోలీసులు స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పట్టణంలోకి ప్రవేశించే మార్గంలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. బయటి వ్యక్తులు పట్టణంలోకి ప్రవేశించి అల్లర్లు సృష్టించకుండా ఆర్టీసీ బస్సులను కూడా ఆపి తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో, రామాలయ నిర్మాణానికి మద్దతుగా ఆకివీడు వెళ్తున్న సినీ నటి కరాటే కల్యాణిని ఏలూరు జిల్లా కైకలూరు వద్ద పోలీసులు అడ్డుకుని, ముందుజాగ్రత్త చర్యగా అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల చర్యను ఆమె ఖండించారు. తాను ఎప్పటికైనా ఆకివీడు వచ్చి తీరతానని మద్దతుదారులకు వీడియో సందేశం పంపారు. గత వారం శ్రీరామనవమి సందర్భంగా ఆకివీడులోని పెదపేట ప్రాంతంలో ఉన్న ఆలయంలోని రాముడి విగ్రహానికి డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు దండ వేయడం ఉద్రిక్తతకు దారితీసింది. విగ్రహానికి దండ వేయవద్దని స్థానిక దళితులు కోరినప్పటికీ ఆయన ముందుకు సాగారు. ఆయన కారు ఎక్కుతున్న సమయంలో 'జై భీమ్' నినాదాలు చేస్తూ కొందరు వ్యక్తులు రాళ్లు, కర్రలతో ఆయన కాన్వాయ్‌పై దాడి చేశారు. ఈ ఘటనలో ముగ్గురు గాయపడ్డారు. ఈ కట్టడం వద్ద గత నెల రోజులుగా వివాదం కొనసాగుతోంది. ఈ ఆలయాన్ని నిర్మించినట్లు 1932లో భావిస్తున్నారు. అయితే, ఇక్కడి ప్రధాన దైవం తమ కులదేవత అయిన గొంతెనమ్మ అని స్థానికులు చెబుతున్నారు. ఇటీవల మానవ హక్కుల వేదిక (హెచ్ఆర్ఎఫ్) విడుదల చేసిన ఒక నివేదిక ప్రకారం, ఈ కట్టడం సంప్రదాయ ఆలయం కాదని, గొంతెనమ్మ విగ్రహం ఉన్న ఒక సత్రం మాత్రమేనని పేర్కొంది. కొన్ని దశాబ్దాల క్రితం, గొంతెనమ్మ ఆలయ నిర్వాహకుల అంగీకారంతోనే రాముడు, సీత విగ్రహాలను కూడా ఇక్కడ ఏర్పాటు చేసినట్లు తెలిపింది. గొంతెనమ్మ ఆలయాన్ని రామాలయంగా మార్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఈ ప్రయత్నాల వెనుక టీడీపీ ఎమ్మెల్యే, అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ అయిన రఘురామకృష్ణరాజుతో పాటు కొన్ని హిందూ సంస్థలు ఉన్నాయని హెచ్ఆర్ఎఫ్ తన నివేదికలో ఆరోపించింది.

# విదేశాలకు వెళ్లొస్తే గర్భగుడిలో ఎంట్రీ లేదు

**ఏపీ హైకోర్టు కీలక ఆదేశాలు**



అమరావతి, ఏప్రిల్ 5 (ఈవార్తలు): ఏపీలోని ఆలయాల్లో అర్చకులు నిర్వహించే పూజలకు సంబంధించి హైకోర్టు కీలకమైన ఆదేశాలు జారీ చేసింది. విదేశాలకు వెళ్లి వచ్చిన అర్చకులు ఆలయ ప్రధాన గర్భాలయంలోకి ప్రవేశించి పూజలు చేయడానికి వీల్లేదని స్పష్టం చేసింది. ఈ మేరకు ఆగమ శాస్త్ర నియమాలు, శృంగేరి శారదా పీఠం మార్గదర్శకాలు, రాష్ట్ర దేవాదాయ శాఖ గతంలో జారీ చేసిన సర్క్యులర్‌ను కఠినంగా అమలు చేయాలని దేవాదాయ శాఖ ఉన్నతాధికారులను ఆదేశించింది. దీనికి సంబంధించి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు మార్చి 30న తుది ఉత్తర్వులు ఇచ్చారు. విజయవాడ శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన శ్రీచక్ర నవావరణ అర్చన పారాయణదారు డీఎస్ఎన్ఎస్ సుబ్రహ్మణ్యం సోమయాజి ఈ అంశంపై ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. 2010లో ధార్మిక పరిషత్ జారీ చేసిన సర్క్యులర్‌ను, శృంగేరి శారదా పీఠాధిపతి జగద్గురువు మహాతీర్థ భారతీస్వామి విడుదల చేసిన ప్రామాణికను ఆలయాల్లో సరిగ్గా అమలు చేయడం లేదని ఆయన కోర్టు దృష్టికి తెచ్చారు. పిటిషనర్ తరఫు న్యాయవాది కేఆర్ శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ.. నిబంధనల ప్రకారం అర్చకులకు విదేశాలకు వెళ్లేందుకు అనుమతి లేదని గుర్తుచేశారు. అత్యవసర పరిస్థితుల్లో వెళ్లినా, తిరిగి వచ్చాక గర్భగుడిలో పూజలు చేసే అర్హతను వారు కోల్పోతారని స్పష్టం చేశారు. అలాంటి అర్చకులు కేవలం ఆలయ ప్రాంగణంలో బయట జరిగే వ్రతాలు, ఇతర పూజా కార్యక్రమాల్లో మాత్రమే పాల్గొనవచ్చని వివరించారు. శృంగేరి పీఠం ప్రామాణిక ప్రకారం.. త్రికాల సంధ్యావందనం, వేద అధ్యయనం, గురు ఉపదేశ మంత్ర జపం, కఠినమైన ఆహార నియమాలు పాటిస్తూ ఆధ్యాత్మిక క్రమశిక్షణతో ఉండేవారు మాత్రమే గర్భగుడిలో పూజలకు అర్హులని తెలిపారు. విదేశాలకు వెళ్లి సంప్రదాయాలకు విరుద్ధంగా క్షవరం, జుట్టు కత్తిరించుకున్న వారు కూడా అనర్హులని కోర్టుకు నివేదించారు. ఈ వాదనలపై స్పందించిన దేవాదాయ శాఖ తరఫు న్యాయవాది, శృంగేరి పీఠం మార్గదర్శకాలు, శాఖాపరమైన సర్క్యులర్‌ను అనుసరించి నిర్ణయం తీసుకుంటామని కోర్టుకు తెలిపారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం, ఈ మార్గదర్శకాలను తప్పనిసరిగా అమలు చేయాలని దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి, కమిషనర్‌లకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఇకపై రాష్ట్రంలోని ఆలయాల్లో అర్చకుల నియామకాలు, పూజల విషయంలో ఈ నిబంధనలు కీలకం కానున్నాయి.



## తిరుమల కొండపై భక్తుల రద్దీ

తిరుమల, ఏప్రిల్ 5 (ఈవార్తలు): తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. వారాంతం కావడంతో కొండపై భక్తుల రద్దీ పెరిగింది. ఆదివారం నాడు వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండిపోయి, క్యూలైన్లు శిలాతోరణం వరకు బారులు తీరాయి. సర్వదర్శనం టోకెన్లు లేని భక్తులకు శ్రీవారిని దర్శించుకోవడానికి సుమారు 18 గంటల సమయం పడుతోందని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు తెలిపారు. టీటీడీ విడుదల చేసిన వివరాల ప్రకారం, శనివారం ఒక్కరోజే 80,841 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వీరిలో 33,559 మంది భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు భక్తిశ్రద్ధలతో సమర్పించిన కానుకల ద్వారా శ్రీవారి హుండీ ఆదాయం రూ. 3.45 కోట్లుగా నమోదైందని టీటీడీ వెల్లడించింది. భక్తుల రద్దీ నేపథ్యంలో అధికారులు తగిన ఏర్పాట్లు చేస్తూ, క్యూలైన్లలోని వారికి తాగునీరు, అల్పాహారం వంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని భక్తులు తమ ప్రయాణాలను ప్లాన్ చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

## కోల్‌కతాపై దాడి చేస్తామన్న పాక్ మంత్రి

**బీజేపీ, కాంగ్రెస్ మండిపాటు**



న్యూఢిల్లీ: భారత్‌తో భవిష్యత్తులో ఏదైనా ఘర్షణ జరిగితే, పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాపై దాడి చేస్తామంటూ పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ చేసిన హెచ్చరికలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. భారత్ ఒక 'ఫాల్స్ ఫ్లాగ్ ఆపరేషన్'కు ప్లాన్ చేస్తోందని కూడా ఆయన ఆరోపించారు. ఈ వ్యాఖ్యలపై బీజేపీ, కాంగ్రెస్ సహా పలు భారత రాజకీయ పార్టీలు తీవ్రస్థాయిలో మండిపడ్డాయి. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ఖవాజా ఆసిఫ్, "భారత్ తమ ఆధీనంలో ఉన్న పాకిస్థానీల ద్వారా లేదా తమ సొంత మనుషులతోనే ఎక్కడో మృతదేహాలను ప్లాంట్ చేసి, వారిని ఉగ్రవాదులుగా చిత్రీకరించి ఒక ఫాల్స్ ఫ్లాగ్ ఆపరేషన్‌కు కుట్ర చేస్తోంది. ఈసారి అలాంటి నాటకానికి ప్రయత్నిస్తే, దేవుడి దయ వల్ల మేం దానిని కోల్‌కతా వరకు తీసుకెళతాం" అని హెచ్చరించారు. పాక్ మంత్రి వ్యాఖ్యలను కాంగ్రెస్ ఎంపీ మనీశ్ తివారీ తీవ్రంగా ఖండించారు. ఫాల్స్ ఫ్లాగ్ ఆపరేషన్లలో పాకిస్థాన్ 'పీహెచ్‌డీ' చేసిందని ఆయన ఎద్దేవా చేశారు. "దక్షిణాసియాలో ఉగ్రవాదానికి ఏదైనా కేంద్ర స్థానం ఉందంటే అది పాకిస్థానే. అలాంటిది ఇతరులపై నిరాధార ఆరోపణలు చేస్తూ పాక్ తనను తానే అపహాస్యం చేసుకుంటోంది" అని ఐఏఎన్ఎస్‌తో మాట్లాడుతూ విమర్శించారు. బీజేపీ అధికార ప్రతినిధి ప్రతుల్ షా డియో కూడా ఘాటుగా స్పందించారు. గతేడాది జరిగిన 'ఆపరేషన్ సిందూర్'ను పాకిస్థాన్‌కు గుర్తు చేశారు. "ఆపరేషన్ సిందూర్‌లో వారి భూభాగంలోకి వెళ్లి ఉగ్రవాద మౌలిక సదుపాయాలను ఎలా నాశనం చేశామో వారు మర్చిపోయి ఉండరనుకుంటున్నా. కాల్పుల విరమణ కోసం పాకిస్థాన్ మమ్మల్ని వేడుకుంది. కోల్‌కతా వారికి అందని ద్రాక్ష. మేం తలుచుకుంటే పాకిస్థాన్‌లోని ఏ ప్రాంతంలోనైనా దాడి చేయగలం" అని ఆయన స్పష్టం చేశారు. జేడీ(యూ) నేత నీరజ్ కుమార్ సైతం పాక్ మంత్రి వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరమని పేర్కొన్నారు.

## కాలి బూడిదైన ఆర్టీసీ బస్సు

**కడప జిల్లాలో తప్పిన పెను ప్రమాదం**

కడప, ఏప్రిల్ 5 (ఈవార్తలు): వైఎస్ఆర్ కడప జిల్లాలో పెను ప్రమాదం త్రుటిలో తప్పింది. ఓ ఆర్టీసీ బస్సులో మంటలు చెలరేగగా, డ్రైవర్ వేగంగా స్పందించడంతో అందులో ఉన్న 21 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ఈ ఘటన వేంపల్లి మండలం వీరన్నగట్టుపల్లి సమీపంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే, కదిరి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు 21 మంది ప్రయాణికులతో వేంపల్లి నుంచి కదిరికి బయలుదేరింది. వీరన్నగట్టుపల్లి వద్దకు రాగానే, రోడ్డుకు అడ్డంగా తక్కువ ఎత్తులో వేలాడుతున్న 11 కేవీ విద్యుత్ తీగలు బస్సు పైభాగానికి తగిలాయి. దీంతో ఒక్కసారిగా షార్ట్ సర్క్యూట్ అయి మంటలు చెలరేగాయి. బస్సు లోపల పొగలు, మంటలు గమనించిన ప్రయాణికులు భయంతో కేకలు వేశారు. వెంటనే అప్రమత్తమైన డ్రైవర్ బస్సును రోడ్డు పక్కన నిలిపివేశారు. ప్రయాణికులందరినీ హుటాహుటిన కిందకు దించారు. వారు దిగిన కొద్దిసేపటికే మంటలు బస్సు మొత్తానికి వ్యాపించి పూర్తిగా దగ్ధమైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. అయితే, అప్పటికే బస్సు కాలి బూడిదైంది. విద్యుత్ తీగలు ప్రమాదకరంగా కిందకు వేలాడటమే ఈ దుర్ఘటనకు కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఘటనపై వేంపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

## నీటి సంరక్షణకు 100 రోజుల యాక్షన్ ప్లాన్

అమరావతి, ఏప్రిల్ 5 (ఈవార్తలు): ఏపీలో నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భారీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 'నీటి భద్రత-సాగునీటి సంఘాల బాధ్యత' పేరుతో 100 రోజుల ప్రత్యేక కార్యాచరణను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ప్రజల భాగస్వామ్యంతో జల సంరక్షణను ఒక ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. ఏప్రిల్ 6 నుంచి జులై 14వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. ఇందులో భాగంగా నేడు రాష్ట్రంలోని సాగునీటి సంఘాల సభ్యులతో ముఖ్యమంత్రి టెలికాన్ఫరెన్స్ నిర్వహించి, రాబోయే 100 రోజుల ప్రణాళికపై వారికి దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమం ప్రారంభ సూచికగా, సీఎం చంద్రబాబు సోమవారం తాడిపత్రి నియోజకవర్గంలోని యాడికిలో జరిగే కార్యక్రమంలో పాల్గొననున్నారు. నీటి భద్రత కేవలం ప్రభుత్వ బాధ్యతే కాదని, ఇందులో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ బృహత్తర కార్యక్రమంలో రాష్ట్రంలోని 60 వేల మంది సాగునీటి సంఘాల సభ్యులను భాగస్వాములను చేస్తూ వారికి కీలక బాధ్యతలు అప్పగించారు. "ప్రతి నీటి చుక్కను ఒడిసి పట్టుకోవాలి, ప్రతి బొట్టును సంరక్షించుకోవాలి, భూగర్భ జలాలను పెంచాలి" అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఇరిగేషన్, అటవీ, పంచాయతీ రాజ్, వ్యవసాయ, పశు సంవర్ధక శాఖలు సమన్వయంతో పనిచేసి సాగునీటి సంఘాలకు పూర్తి సహకారం అందించాలని ఆదేశించారు.

## అల్లూరి జిల్లాలో భూకంపం

అల్లూరి జిల్లా, ఏప్రిల్ 5 (ఈవార్తలు): అల్లూరి సీతారామరాజు జిల్లాలో శనివారం అర్ధరాత్రి భూప్రకంపనలు సంభవించాయి. జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో భూమి కంపించడంతో నిద్రలో ఉన్న ప్రజలు భయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. వివరాల్లోకి వెళితే.. శనివారం రాత్రి సుమారు 11:30 గంటల సమయంలో పాడేరు, హుకుంపేట, పెదబయలు, అరకులోయ మండలాల్లో సుమారు 30 సెకన్ల పాటు భూమి కంపించింది. ఒడిశా-ఆంధ్రప్రదేశ్ సరిహద్దు ప్రాంతంలో భూకంప కేంద్రం ఉన్నట్లు గుర్తించారు.

# పైలట్‌ను కాపాడుకున్న అమెరికా

## సినీ ఫక్కీలో రెస్క్యూ ఆపరేషన్

ఇరాన్ గడ్డపై అత్యంత సాహసోపేతమైన, ఉత్కంఠభరితమైన ఆపరేషన్ చేపట్టి, తమ వైమానిక దళ అధికారిని అమెరికా సైన్యం సురక్షితంగా రక్షించుకుంది. శత్రు దళాలు చుట్టుముడుతున్న వేళ, వ్యూహాత్మకంగా వ్యవహరించి తమ పైలట్ ను కాపాడుకున్న తీరు ఇప్పుడు అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది. "అమెరికా సైనిక చరిత్రలోనే ఇది అత్యంత ధైర్యసాహసాలతో కూడిన రెస్క్యూ ఆపరేషన్" అని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోషల్ మీడియాలో ప్రకటించారు. గత శుక్రవారం, దక్షిణ ఇరాన్‌లోని పర్వత ప్రాంతాల్లో అమెరికాకు చెందిన ఎఫ్-15ఈ స్ట్రైక్ ఈగిల్ యుద్ధ విమానాన్ని ఇరాన్ గగనతల రక్షణ వ్యవస్థ కూల్చివేసింది. ప్రమాదాన్ని పసిగట్టిన విమానంలోని ఇద్దరు సిబ్బంది వెంటనే బయటకు దూకేశారు (ఎజెక్ట్ అయ్యారు). వీరిలో ఒకరిని అమెరికా దళాలు వెంటనే రక్షించగా, వెపన్స్ సిస్టమ్ ఆఫీసర్ (సెకండ్ పైలట్) ఆచూకీ లభించలేదు. కేవలం ఒక హ్యాండ్‌గన్‌తో అతడు 24 గంటలకు పైగా ఇరాన్ పర్వత ప్రాంతాల్లో ఒంటరిగా చిక్కుకుపోయాడు. అతడిని సజీవంగా పట్టుకునేందుకు ఇరాన్ ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ దళాలు, బసీజ్ ఫోర్స్‌లు, స్థానిక గిరిజన తెగలు ఆ ప్రాంతాన్ని జల్లెడ పట్టడం ప్రారంభించాయి. ఈ క్లిష్ట సమయంలో అమెరికా గూఢచార సంస్థ 'సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ' (జుూా) రంగంలోకి దిగి కీలక పాత్ర పోషించింది. తొలుత, గాయపడిన పైలట్ కచ్చితమైన లొకేషన్‌ను గుర్తించి పెంటగాన్‌కు సమాచారం అందించింది. ఆ తర్వాత, ఇరాన్ దళాల దృష్టి మళ్లించడానికి ఒక అద్భుతమైన వ్యూహం పన్నింది. అమెరికన్ అధికారిని భూమార్గంలో ఒక కాన్వాయ్‌లో సరిహద్దులు దాటిస్తున్నట్లు నకిలీ సమాచారాన్ని ఇరాన్ వర్గాలకు అందేలా చేసింది. దీంతో ఇరాన్ దళాలు ఆ కాన్వాయ్‌ను లక్ష్యంగా చేసుకుని గాలింపును ఆ దిశగా మళ్లించాయి. సీఐఏ పన్నిన వ్యూహంతో ఇరాన్ దళాలు తప్పుదారి పట్టగా, అసలు కార్యాచరణను అమెరికా అత్యంత నిష్ణాతులైన 'నేవీ సీల్స్' బృందం ప్రారంభించింది. డజన్ల కొద్దీ అమెరికా యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు ఇరాన్ గగనతలంలోకి ప్రవేశించి రక్షణ కవచంలా నిలిచాయి. పర్వత ప్రాంతంలో దాక్కున్న అధికారిని నేవీ సీల్స్ బృందం సురక్షితంగా చేరుకుంది. ఈ ఆపరేషన్ సమయంలో అమెరికా, ఇరాన్ దళాల మధ్య ఘర్షణలు కూడా జరిగినట్లు సమాచారం. అమెరికాకు చెందిన ఒక డ్రోన్‌ను ఇస్ఫహాన్ ప్రాంతంలో కూల్చివేసినట్లు ఇరాన్ ప్రకటించింది. అంతకుముందు పైలట్‌ను రక్షించేందుకు వెళ్లిన బ్లాక్ హాక్ హెలికాప్టర్‌పై స్థానిక తెగలు కాల్పులు జరిపిన వీడియోలు కూడా వెలుగులోకి వచ్చాయి.



అయినప్పటికీ, అమెరికా దళాలు ఎక్కడా వెనక్కి తగ్గకుండా, తమ అధికారిని విజయవంతంగా రక్షించి వెనక్కి తీసుకొచ్చాయి. ఒక్క సైనికుడి ప్రాణాలను కాపాడేందుకు అమెరికా ఎంతటి సాహసానికైనా సిద్ధపడుతుందని ఈ ఘటన మరోసారి నిరూపించింది. తమ అధికారిని సజీవంగా పట్టిచ్చిన వారికి ఇరాన్ రివార్డు కూడా ప్రకటించినట్లు వార్తలు వచ్చినా, అమెరికా వ్యూహం ముందు అవేవీ ఫలించలేదు. తమవైపు ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా ఆపరేషన్ పూర్తయిందని ట్రంప్ స్పష్టం చేశారు. ఈ ఘటనతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. ఈ క్రమంలో... అమెరికాకు చెందిన ఒక రవాణా విమానం, రెండు హెలికాప్టర్లను కూల్చివేసినట్టు ఇరాన్ ప్రకటించింది. అయితే, ఆ విమానాన్ని, హెలికాప్టర్లను తామే పేల్చివేశామని... సాంకేతిక లోపంతో నిలిచిపోయిన వాటిని వ్యూహాత్మకంగా తామే ధ్వంసం చేశామని అమెరికా చెబుతోంది.

## మాకు ఇస్తానని అటు మళ్లిస్తారా?

**అమెరికాపై జెలెన్ స్కీ తీవ్ర అసంతృప్తి**



కీవ్: పశ్చిమాసియాలో ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య రాజుకున్న ఉద్రిక్తతలు సుదీర్ఘకాలం కొనసాగితే, తమ దేశానికి అమెరికా, ఇతర పశ్చిమ దేశాల నుంచి అందే సైనిక సహాయం గణనీయంగా తగ్గిపోతుందని ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోదిమిర్ జెలెన్‌స్కీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కొత్త సంక్షోభం వల్ల పశ్చిమ దేశాల ప్రాధాన్యతలు మారిపోయాయని, ఇది రష్యా-ఉక్రెయిన్ యుద్ధంపై తీవ్ర ప్రభావం చూపుతోందని ఆయన అన్నారు. ఓ ఇంటర్వ్యూలో జెలెన్‌స్కీ మాట్లాడుతూ, "అమెరికా మాకు ఇవ్వాల్సిన క్షిపణులు, ఆయుధాలు ఇప్పుడు ఇజ్రాయెల్ వైపు మళ్లుతున్నాయి" అని వాపోయారు. గతంలో రష్యా బాలిస్టిక్ క్షిపణులను ఎదుర్కోవడానికి అమెరికా సరఫరా చేసిన పేట్రియాట్ వంటి రక్షణ వ్యవస్థలు ఉపయోగపడ్డాయని, కానీ ఇప్పుడు ఆ సరఫరా తగ్గిపోవడంతో యుద్ధంలో ఉక్రెయిన్ తీవ్రంగా నష్టపోతోందని వివరించారు. పశ్చిమాసియాలో యుద్ధం ఎంతకాలం కొనసాగితే, తమకు ఆయుధాలు అందే అవకాశాలు అంతగా తగ్గిపోతాయని అన్నారు. అమెరికాకు ఇప్పుడు ఉక్రెయిన్ ప్రధాన ప్రాధాన్యత కాదని స్పష్టమవుతోందని జెలెన్‌స్కీ అభిప్రాయపడ్డారు. తమ ఆయుధ నిల్వలు వేగంగా తరిగిపోతున్నాయని, దీంతో అమెరికా మద్దతు తగ్గడంతో సొంతంగా డ్రోన్ల తయారీని పెంచుతున్నామని చెప్పారు. అయితే, రష్యా తమ ఇంధన, ఆయుధ ఉత్పత్తి కేంద్రాలను లక్ష్యంగా చేసుకోవడం ఇబ్బందిగా మారిందని తెలిపారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం మూడో సంవత్సరంలోకి ప్రవేశించిన తరుణంలో, పశ్చిమాసియాలో తలెత్తిన ఈ కొత్త సంక్షోభం పశ్చిమ దేశాల దృష్టిని మరల్చడం రష్యాకు అనుకూలంగా మారుతుందని జెలెన్‌స్కీ పరోక్షంగా సూచించారు. ఈ పరిణామాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపైనా ప్రభావం చూపి, ఉక్రెయిన్‌కు మరిన్ని సవాళ్లను సృష్టిస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు.

## 19 ఏళ్లకే సీఏ... వరల్డ్ రికార్డు

భోపాల్: పట్టుదల, కఠోర శ్రమ ఉంటే వయసు కేవలం ఒక అంకె మాత్రమేనని నిరూపించింది మధ్యప్రదేశ్‌కు చెందిన నందిని అగర్వాల్. కేవలం 19 ఏళ్ల 8 నెలల 18 రోజుల వయసులో చార్టర్డ్ అకౌంటెన్సీ ఫైనల్ పరీక్షను క్లియర్ చేసి, ప్రపంచంలోనే అతి పిన్న వయస్కురాలైన సీఏగా గిన్నిస్ వరల్డ్ రికార్డు సృష్టించారు. ఈ అసాధారణ విజయంతో ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో కూడా ఆమె పేరు నమోదైంది. మధ్యప్రదేశ్‌లోని చిన్న పట్టణం మొరేనాలో జన్మించిన నందిని, 2021లో జరిగిన సీఏ ఫైనల్ పరీక్షలో సంచలనం సృష్టించింది. దాదాపు 83,000 మంది అభ్యర్థులను అధిగమించి, 800 మార్కులకు 614 మార్కులు (76.75 శాతం) సాధించి ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంక్ కైవసం చేసుకుంది. దీనికంటే ముందు 16 ఏళ్ల వయసులోనే సీఏ ఇంటర్మీడియట్ పరీక్షలో ఆలిండియా లెవల్లో 31వ ర్యాంక్ సాధించి తన ప్రతిభను చాటుకుంది. చిన్నప్పటి నుంచే చదువులో చురుగ్గా ఉండే నందిని, 13 ఏళ్లకే 10వ తరగతి, 15 ఏళ్లకే 12వ తరగతి పూర్తి చేసింది. 11వ తరగతి చదువుతున్నప్పుడు తన పాఠశాలకు వచ్చిన ఓ గిన్నిస్ రికార్డు హోల్డర్‌ను చూసి తాను కూడా అలాంటి రికార్డు సాధించాలని కలలు కన్నట్లు నందిని తెలిపింది.

## ఇరాన్ సైన్యం కళ్లుగప్పిన అమెరికా పైలట్

టెహ్రాన్: అది శత్రువుల అడ్డా.. గాల్లో ఎగురుతున్న అమెరికా యుద్ధ విమానం ఎఫ్-15ఈ స్ట్రైక్ ఈగిల్‌ను ఇరాన్ దళాలు కూల్చివేశాయి.. అందులోని వెపన్ సిస్టమ్స్ ఆఫీసర్ (సెకండ్ పైలట్) గాయాలతో పారాచూట్ సాయంతో ఇరాన్ పర్వత ప్రాంతంలో దిగాడు.. ఒంటరిగా, గాయాలతో ఉన్న అతడికి చుట్టూ శత్రు సైన్యం కదలికలు.. ఆ పరిస్థితుల్లో సుమారు 24 గంటలకు పైగా అతను ప్రాణాలతో ఎలా బయటపడ్డాడనే అంశం ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. తన శిక్షణ, క్రమశిక్షణ, భూభాగంపై అవగాహనతో అతను ఇరాన్ దళాల కళ్లుగప్పి ప్రాణాలను కాపాడుకున్నాడని సీఎన్ఎన్ తన కథనంలో వెల్లడించింది. విమానం కూలిన వెంటనే ఆ అమెరికన్ అధికారి పర్వతాల మధ్య ఉన్న ఒక గుహలో తలదాచుకున్నాడు. అది తాత్కాలిక రక్షణ మాత్రమే. తనను పట్టుకోవడానికి ఇరాన్ సెర్చ్ బృందాలు ఆ ప్రాంతాన్ని జల్లెడ పడుతున్నాయని అతనికి తెలుసు. అతని వద్ద ఉన్నది కేవలం ఒక పిస్టల్, కమ్యూనికేషన్ పరికరం, ట్రాకింగ్ బీకన్ మాత్రమే. ఒకేచోట ఉంటే దొరికిపోవడం ఖాయమని భావించి, నిరంతరం తన స్థానాన్ని మార్చుకుంటూ, పొదలు, రాళ్ల మాటున దాక్కుంటూ ముందుకు సాగాడు. మరోవైపు, అతడిని పట్టిచ్చిన వారికి భారీ బహుమతి ఇస్తామని ఇరాన్ అధికారులు ప్రకటించడంతో స్థానిక పౌరులు కూడా గాలింపులో పాల్గొన్నారు. ఇది పరిస్థితిని మరింత క్లిష్టతరం చేసింది. అయినా ఆ అధికారి ధైర్యం కోల్పోలేదు. అమెరికా సైన్యం అందించిన సర్వైవల్ ప్రోటోకాల్స్‌ను తూచా తప్పకుండా పాటించాడు. ఎవరి కంటా పడకుండా, సాధ్యమైనప్పుడల్లా తన బృందంతో కమ్యూనికేట్ చేస్తూ, రెస్క్యూ బృందాలకు సిగ్నల్స్ అందించేందుకు అనువైన ప్రదేశాల కోసం వెతికాడు. ఈ క్రమంలో, మెరుగైన సిగ్నల్ కోసం సుమారు 7,000 అడుగుల ఎత్తైన పర్వత శిఖరాన్ని గాయాలతోనే అధిరోహించడం అతని ధైర్యానికి, పట్టుదలకు నిదర్శనం. అతని ట్రాకింగ్ బీకన్ కారణంగా అమెరికా సైన్యం అతని కదలికలను రియల్ టైంలో గమనిస్తూనే ఉంది. ఈ పరిస్థితి అత్యంత తీవ్రమైనదని అప్పటి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. చివరికి, అమెరికా సైన్యం అత్యంత సాహసోపేతమైన రెస్క్యూ ఆపరేషన్ చేపట్టింది. సీఐఏ సహాయంతో ఇరాన్ దళాలను తప్పుదోవ పట్టించి, కమాండోలు ఆ అధికారి ఉన్న ప్రదేశానికి చేరుకున్నారు. అతనికి ప్రథమ చికిత్స అందించి సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. ఈ ఆపరేషన్‌లో ఇరాన్ చేతికి చిక్కకుండా రెండు అమెరికా విమానాలను ధ్వంసం చేయాల్సి వచ్చింది. ఈ ఘటనతో అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగాయి.

## అమెరికా రెస్క్యూ ఆపరేషన్ విఫలం చేశాం: ఇరాన్

టెహ్రాన్: తమ భూభాగంలో అమెరికా చేపట్టిన ఓ రెస్క్యూ ఆపరేషన్‌ను విఫలం చేశామని ఇరాన్ ప్రకటించింది. ఈ ఆపరేషన్ సందర్భంగా ఒక సీ-130 రవాణా విమానంతో పాటు రెండు బ్లాక్ హాక్ హెలికాప్టర్లను కూల్చివేసినట్లు ఇరాన్ రివొల్యూషనరీ గార్డ్స్ (ఐఆర్జీసీ) సంచలన ప్రకటన చేసింది. అమెరికా చేపట్టిన ఈ చర్య పూర్తిగా విఫలమైందని ఇరాన్ సైనిక కమాండ్ పేర్కొంది. ఈ ఆపరేషన్‌లో ఐదుగురు మరణించినట్లు ఇరాన్ మీడియా తెలిపింది. అయితే, ఈ ఆపరేషన్ చరిత్రలోనే అత్యంత సాహసోపేతమైందని, తమ పైలట్‌ను విజయవంతంగా రక్షించుకున్నామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. గత శుక్రవారం ఇరాన్ కూల్చివేసిన తమ ఎఫ్-15ఈ యుద్ధ విమానంలో తప్పిపోయిన రెండో పైలట్‌ను (కల్నల్ ర్యాంక్ అధికారి) సురక్షితంగా కాపాడినట్లు ఆయన వెల్లడించారు. ఈ ఆపరేషన్‌లో ఒక్క అమెరికా సైనికుడు కూడా గాయపడలేదని ట్రంప్ తన ట్రూత్ సోషల్ పోస్టులో పేర్కొన్నారు. శుక్రవారం నాడు మధ్య ఇరాన్‌లో అమెరికాకు చెందిన ఎఫ్-15ఈ యుద్ధ విమానం కూలిపోయింది. అందులోని ఇద్దరు పైలట్లలో ఒకరిని వెంటనే రక్షించగా, రెండో పైలట్ కోసం అమెరికా ప్రత్యేక దళాలు భారీ ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలోనే అమెరికా విమానాలను కూల్చివేశామని ఇరాన్ చెబుతోంది. ఇస్ఫహాన్ ప్రావిన్స్‌లో శత్రు విమానాలు మంటల్లో కాలిపోతున్నాయని ఇరాన్ అధికార ప్రతినిధి తెలిపారు. ఇజ్రాయెల్‌కు చెందిన ఓ డ్రోన్‌ను కూడా కూల్చివేసినట్లు ఇరాన్ ప్రకటించింది. ఈ పరస్పర విరుద్ధ ప్రకటనలతో అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రస్థాయికి చేరాయి. ఇదే సమయంలో మరో అమెరికా యుద్ధ విమానం ఏ-10ను కూడా కూల్చినట్లు వార్తలు వస్తుండటం గమనార్హం.

## గల్ఫ్ నుంచి భారత్‌కు మరిన్ని విమానాలు

న్యూఢిల్లీ: గల్ఫ్ ప్రాంతం నుంచి భారత్‌కు విమాన సర్వీసుల పరిస్థితి మెరుగుపడుతోంది. ఆదివారం ఒక్కరోజే యూఏఈ నుంచి 90 ప్రత్యేక విమానాలు భారత్‌కు చేరుకోనున్నాయని అధికారిక ప్రకటన వెల్లడించింది. సౌదీ అరేబియా, ఒమన్ నుంచి కూడా విమానాలు నడుస్తున్నాయి. ఖతార్ గగనతలం పాక్షికంగా తెరుచుకోవడంతో, అక్కడి నుంచి 8 నుంచి 10 విమానాలు వచ్చే అవకాశం ఉంది. కువైట్, బహ్రెయిన్ దేశాల్లో గగనతలాలను మూసివేసినప్పటికీ, సౌదీ అరేబియాలోని దమ్మామ్ మీదుగా ప్రయాణ సౌకర్యాలు కల్పిస్తున్నారు. అదేవిధంగా, ఇజ్రాయెల్ నుంచి ఈజిప్ట్, జోర్డాన్ మీదుగా, ఇరాక్ నుంచి జోర్డాన్, సౌదీ అరేబియా మీదుగా భారతీయులను తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. ఇరాన్ నుంచి ప్రయాణాలను అర్మేనియా, అజర్‌బైజాన్ ద్వారా సులభతరం చేస్తున్నారు. ఇటీవల ఒమన్ తీరంలో నౌకపై జరిగిన దాడిలో మరణించిన భారత నావికుడి పార్థివదేహాన్ని స్వదేశానికి తీసుకొచ్చారు. ఆయన కుటుంబానికి అవసరమైన అన్ని సహాయాలను అందిస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది. మరోవైపు, ఇరాన్‌లో చిక్కుకుపోయిన 345 మంది భారత జాలర్లు శనివారం సురక్షితంగా చెన్నైకి చేరుకున్నారు. గల్ఫ్, పశ్చిమాసియాలో మారుతున్న పరిస్థితులను విదేశాంగ మంత్రిత్వ శాఖ నిశితంగా గమనిస్తోంది. భారతీయుల భద్రత, సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు స్పష్టం చేసింది. ఇందుకోసం ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను, 24 గంటల హెల్ప్‌లైన్లను నిర్వహిస్తున్నారు. అక్కడి భారత రాయబార కార్యాలయాలు స్థానిక అధికారులతో సమన్వయం చేసుకుంటూ విద్యార్థులు, నౌక సిబ్బందికి కూడా అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తున్నట్లు విదేశాంగ శాఖ పేర్కొంది.

## హార్మూజ్ దాటిన భారత నౌక 'గ్రీన్ ఆశా'

న్యూఢిల్లీ: పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్నప్పటికీ, కీలకమైన హార్మూజ్ జలసంధి గుండా భారత నౌకల రాకపోకలు నిరంతరాయంగా సాగుతున్నాయి. తాజాగా 'గ్రీన్ ఆశా' అనే భారత జెండాతో కూడిన ఎల్పీజీ నౌక ఈ జలసంధిని సురక్షితంగా దాటింది. ఈ ప్రాంతంలో సంక్షోభం మొదలైనప్పటి నుంచి ఈ కీలక సముద్ర మార్గాన్ని దాటిన తొమ్మిదో భారత ట్యాంకర్ ఇదే కావడం గమనార్హం. ఫిబ్రవరి 28న అమెరికా-ఇజ్రాయెల్ దాడుల అనంతరం ఇరాన్ ఈ జలసంధిపై పట్టు బిగించడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ప్రపంచ ఇంధన సరఫరాలో అత్యంత కీలకమైన ఈ మార్గంలో భద్రతాపరమైన ఆందోళనలు పెరిగాయి. అయినప్పటికీ, ఇంధన అవసరాల దృష్ట్యా భారత్ ఈ మార్గంపైనే ఆధారపడుతోంది. గ్రీన్ ఆశా కంటే ముందు కూడా అనేక భారత నౌకలు ఈ ప్రాంతాన్ని విజయవంతంగా దాటాయి. బీడబ్ల్యూ టైర్, బీడబ్ల్యూ ఎల్మ్ అనే రెండు ఎల్పీజీ నౌకలు సుమారు 94,000 టన్నుల కార్గోను రవాణా చేశాయి. మార్చి నెలలో ఎంటీ శివాలిక్, ఎంటీ నందా దేవి అనే ట్యాంకర్లు 92,700 టన్నుల ఎల్పీజీని గుజరాత్‌లోని ముంద్రా, కాండ్లా పోర్టులకు చేర్చాయి.

# జెఫ్రీ ఎప్‌స్టీన్‌ను ఆశ్రయించిన అనిల్ అంబానీ

**వైట్‌హౌస్‌లో పలుకుబడి కోసమేనని సమాచారం**

ముంబై: రిలయన్స్ గ్రూప్ ఛైర్మన్, ప్రముఖ పారిశ్రామికవేత్త అనిల్ అంబానీకి, అమెరికాలో లైంగిక నేరాలకు పాల్పడి సంచలనం సృష్టించిన జెఫ్రీ ఎప్‌స్టీన్‌కు మధ్య సన్నిహిత సంబంధాలున్నాయంటూ 'ది న్యూయార్క్ టైమ్స్' ఒక సంచలన కథనాన్ని ప్రచురించింది. వైట్‌హౌస్‌లో తనకు మంచి పరిచయాలున్నాయని చెప్పుకొని ఎప్‌స్టీన్.. అనిల్ అంబానీకి దగ్గరయ్యాడని, ఆర్థిక కష్టాల్లో ఉన్నప్పుడు స్నేహితుడిగా సలహాలు కూడా ఇచ్చాడని ఆ కథనం వెల్లడించింది. అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆయన ప్రభుత్వంలో భారత-అమెరికా సంబంధాలు, రక్షణ సహకారంపై పట్టు సాధించేందుకు అనిల్ అంబానీ ప్రయత్నించారు. ఈ క్రమంలోనే ఆయనకు ఎప్‌స్టీన్‌తో పరిచయం ఏర్పడింది. 2017 నుంచి 2019 మధ్య వీరిద్దరి మధ్య వందలాది మెసేజ్‌లు నడిచినట్లు న్యూయార్క్ టైమ్స్ సమీక్షలో తేలింది. "భారత్-అమెరికా సంబంధాలు, రక్షణ సహకారం విషయంలో వైట్‌హౌస్‌తో కలిసి పనిచేయడానికి మీ మార్గనిర్దేశం అవసరం" అని అంబానీ పంపిన మెసేజ్‌కు, తాను "లోపాయికారీ సమాచారం" అందిస్తానని ఎప్‌స్టీన్ బదులిచ్చాడు. ట్రంప్ ప్రభుత్వంలోని కీలక నియామకాలు, విదేశాంగ విధానంపై ఎప్‌స్టీన్ ఎప్పటికప్పుడు అంబానీకి సమాచారం చేరవేసేవాడు. 2017లో భారత రాయబారిగా డేవిడ్ పెట్రియస్‌ను నియమిస్తారా అని అంబానీ అడగ్గా, ఆ ప్రతిపాదన పరిశీలనలో లేదని ఎప్‌స్టీన్ చెప్పాడు. ఆ తర్వాత ఆ పదవి కెన్నెత్ జస్టర్‌కు దక్కింది. అంతేగాక ట్రంప్‌కు అత్యంత సన్నిహితులైన స్టీఫెన్ బ్యానన్, థామస్ బరాక్ వంటి వారితో పరిచయం కల్పిస్తానని కూడా ఎప్‌స్టీన్ ఆఫర్ చేసినట్లు కథనం పేర్కొంది. వీరిద్దరూ 'సిగ్నల్', 'టెలిగ్రామ్' వంటి ఎన్‌క్రిప్టెడ్ యాప్‌ల ద్వారా సంభాషించుకునేవారని, అంబానీ "ుూతీఖుఅఱ ూు' అనే హ్యాండిల్‌ను వాడేవారని తెలిసింది. 2019లో అనిల్ అంబానీ వ్యాపారాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయినప్పుడు, ఎప్‌స్టీన్ ఆయనకు మానసికంగా ధైర్యం చెబుతూ సందేశాలు పంపాడు.





"కేవలం స్నేహితుడిగా మాత్రమే సలహా ఇస్తున్నా, నాకేమీ డబ్బు వద్దు" అని కూడా చెప్పాడు. దీని తర్వాత "లావాదేవీ పూర్తయింది" అని అనిల్ పేరుతో ఎప్‌స్టీన్‌కు ఒక ఈమెయిల్ అందింది. ఆ తర్వాత 2019 మే 23న అంబానీ, మాన్‌హట్టన్‌లోని ఎప్‌స్టీన్ నివాసంలో ఆయన్ను కలిశారు. ఈ భేటీ జరిగిన రెండు నెలలకే.. మైనర్ బాలికలతో లైంగిక, అక్రమ రవాణా ఆరోపణలపై ఎప్‌స్టీన్ అరెస్ట్ అయ్యాడు. ఈ కథనంపై స్పందించేందుకు అనిల్ అంబానీ నిరాకరించినట్లు న్యూయార్క్ టైమ్స్ తెలిపింది.

# పిక్చర్ అభీ బాకీ హై: రాఘవ్ చద్దా

న్యూఢిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీలో (ఆప్) అంతర్గత విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి. తనపై సొంత పార్టీ నేతలు చేస్తున్న విమర్శలపై రాజ్యసభ ఎంపీ రాఘవ్ చద్దా తీవ్రంగా స్పందించారు. పంజాబ్ సమస్యలను పార్లమెంటులో ప్రస్తావించడం లేదన్న ఆరోపణలను తిప్పికొడుతూ, తాను రాష్ట్రం కోసం పనిచేస్తున్నానని స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ఓ వీడియో క్లిప్‌ను పంచుకున్నారు. రాజ్యసభలో తాను పంజాబ్ సమస్యలపై మాట్లాడుతున్న దృశ్యాలు ఆ వీడియోలో ఉన్నాయి. "రాఘవ్ చద్దా పంజాబ్ సమస్యలను పార్లమెంటులో ప్రస్తావించడంలో విఫలమయ్యారని వీడియోలు విడుదల చేయమని ఒత్తిడికి గురైన నా సహచరులకు ఇది ఒక చిన్న ట్రైలర్ మాత్రమే... పిక్చర్ అభీ బాకీ హై" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. పంజాబ్ తనకు కేవలం చర్చనీయాంశం కాదని, అది తన ఇల్లు, విధి, మట్టి, ఆత్మ అని ఆయన ఉద్ఘాటించారు. ఇటీవల రాజ్యసభలో ఆప్ ఉప నేత పదవి నుంచి రాఘవ్ చద్దాను తొలగించిన తర్వాత ఈ వివాదం మొదలైంది. పార్టీలో కొందరు నేతలు ఆయనపై బహిరంగంగానే విమర్శలు గుప్పించారు. దీనిపై చద్దా శనివారం స్పందిస్తూ, "నాపై మూడు ఆరోపణలు చేశారు. అందులో సున్నా శాతం నిజం ఉంది. నేను మౌనంగా ఉంటే, పదేపదే చెప్పే అబద్ధం కూడా నిజంలా అనిపిస్తుంది" అని పేర్కొన్నారు. తనపై ఒక పక్కా ప్రణాళిక ప్రకారం, పథకం ప్రకారం ప్రచారం జరుగుతోందని చద్దా ఆరోపించారు. "నాపై ఒకే రకమైన ప్రశ్నలు, ఒకే రకమైన ఆరోపణలు వస్తున్నాయి. ఇది యాదృచ్ఛికం కాదు, సమన్వయంతో చేస్తున్న దాడి" అని ఆయన ఒక వీడియో సందేశంలో తెలిపారు. ప్రతిపక్షాలు వాకౌట్ చేసినప్పుడు తాను మద్దతు ఇవ్వలేదన్న వాదనను కూడా ఆయన తీవ్రంగా ఖండించారు. "ఇది పూర్తిగా పచ్చి అబద్ధం. పార్లమెంటు చుట్టూ సీసీటీవీ కెమెరాలు ఉన్నాయి. ఎవరైనా వాటిని తనిఖీ చేసి సమాధానం తెలుసుకోవచ్చు" అని ఆయన సవాల్ విసిరారు. తన పార్లమెంటరీ బాధ్యతలను విస్మరించారని పార్టీలోని ఒక వర్గం ఆరోపిస్తుండగా, తన దృష్టి మొత్తం పంజాబ్, దాని ప్రజల పైనే ఉందని, వారి సమస్యలను రాజ్యసభలో నిరంతరం ప్రస్తావిస్తూనే ఉంటానని చద్దా పునరుద్ఘాటించారు.



## అమెరికాకు 'బిగ్ సర్‌ప్రైజ్' ఇస్తాం: ఇరాన్

టెహ్రాన్: అమెరికాతో ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో ఇరాన్ సంచలన ప్రకటన చేసింది. అమెరికాకు చెందిన సీ-130 రవాణా విమానాన్ని తాము కూల్చివేసినట్లు ఆదివారం వెల్లడించింది. చిక్కుకుపోయిన ఒక అమెరికన్ సైనికుడిని గుర్తించేందుకు యూఎస్ చేపట్టిన ఆపరేషన్ సందర్భంగా ఈ ఘటన జరిగిందని పేర్కొంది. ఈ ఆపరేషన్‌లో భాగంగా గగనతలంలోకి వచ్చిన పలు "ఫ్లయింగ్ ఆబ్జెక్ట్స్"ను కూడా ధ్వంసం చేసినట్లు తెలిపింది. ఫార్స్ న్యూస్ ఏజెన్సీ కథనం ప్రకారం ఒక ఇరాన్ అధికారి మాట్లాడుతూ అమెరికాకు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. "అమెరికాకు, దాని మిత్రపక్షాలకు మా వద్ద ఒక పెద్ద సర్‌ప్రైజ్ ఉంది. దానికి ఎంతో సమయం పట్టదు. దక్షిణ ఇరాన్‌లో వారి ప్రవర్తనను బట్టి మా ప్రణాళికల సమయాన్ని మరింత ముందుకు జరిపే అవకాశం ఉంది" అని ఆయన హెచ్చరించారు. అమెరికా సైనిక ఆపరేషన్లు విఫలమయ్యాయని, వారి టార్గెట్ కచ్చితమైంది కాదని ఎద్దేవా చేశారు. "అసమాన యుద్ధ తంత్రంలో శత్రువును ఎలా బలహీనపరచాలో మాకు బాగా తెలుసు. సులభంగా, వేగంగా దాడి చేయాలనే అమెరికా వ్యూహం విఫలమైంది" అని ఆ అధికారి వ్యాఖ్యానించారు. ఇదే సమయంలో అబుదాబిలోని బోరూజ్ పెట్రోకెమికల్ ఫ్యాక్టరీలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. గగనతలంలో దాడులను విజయవంతంగా అడ్డుకున్న తర్వాత, వాటి శకలాలు ఫ్యాక్టరీపై పడటంతో మంటలు చెలరేగినట్లు స్థానిక అధికారులు తెలిపారు. ఈ ఘటనతో పశ్చిమాసియాలో ఉద్రిక్త వాతావరణం మరింత తీవ్రమైంది.



## 37 రోజులుగా ఇంటర్నెట్ షట్‌డౌన్

**ఇరాన్ ప్రజలకు ప్రపంచంతో సంబంధాలు కట్**





టెహ్రాన్: టెహ్రాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్తంగా సైనిక దాడులు ప్రారంభించిన తర్వాత ఇరాన్‌లో విధించిన దేశవ్యాప్త ఇంటర్నెట్ బ్లాక్‌అవుట్ ఐదో వారంలోకి ప్రవేశించింది. ఇది ఇప్పటివరకు ప్రపంచంలోనే అత్యంత సుదీర్ఘమైన జాతీయ స్థాయి ఇంటర్నెట్ షట్‌డౌన్‌గా రికార్డు సృష్టించిందని డిజిటల్ మానిటరింగ్ సంస్థ 'నెట్‌బ్లాక్స్' ఆదివారం వెల్లడించింది. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో నెట్‌బ్లాక్స్ చేసిన పోస్ట్ ప్రకారం, ఈ షట్‌డౌన్ వరుసగా 37 రోజులుగా (864 గంటలకు పైగా) కొనసాగుతోందిఇంతటి తీవ్రతతో, ఇంత సుదీర్ఘకాలం పాటు కొనసాగిన ఘటన చరిత్రలో ఇదే మొదటిదని పేర్కొంది. గతంలో మయన్మార్, సూడాన్, కశ్మీర్ వంటి ప్రాంతాల్లో అంతరాయాలతో కూడిన లేదా ప్రాంతీయ షట్‌డౌన్‌లు ఉన్నప్పటికీ, సాధారణ ఇంటర్నెట్ సదుపాయం ఉన్న ఒక దేశం ఇంతకాలం పూర్తిగా ఆఫ్‌లైన్‌లో ఉండటం ఇదే తొలిసారి. ఫిబ్రవరి 28న ప్రారంభమైన ఈ బ్లాక్‌అవుట్‌తో ఇరాన్ ప్రజలు ప్రపంచ ఇంటర్నెట్‌కు పూర్తిగా దూరమయ్యారు. ప్రభుత్వం ఎంపిక చేసిన వారికి మాత్రమే యాక్సెస్ ఇచ్చే 'వైట్‌లిస్టింగ్' విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేస్తోంది. అమెరికా, ఇజ్రాయెల్ నిరంతరం ఇరాన్‌లోని లక్ష్యాలపై క్షిపణి, డ్రోన్ దాడులు చేస్తుండగా, ఇరాన్ కూడా పొరుగున ఉన్న గల్ఫ్ దేశాల్లోని వారి స్థావరాలపై ప్రతీకార దాడులకు దిగుతోంది. ఈ ఘర్షణల నేపథ్యంలో, ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాలైన వీపీఎన్, శాటిలైట్ కనెక్షన్లను కూడా ఉపయోగించకుండా ప్రభుత్వం కఠిన ఆంక్షలు విధించింది. ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టే సూచనలు కనిపించకపోవడంతో, ఇంటర్నెట్‌ను ఎప్పుడు పునరుద్ధరిస్తారనే దానిపై ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత లేదు.



వయ్యారి చిత్రం



# రేణు దేశాయ్ మాస్ వార్నింగ్

నటి రేణు దేశాయ్ సోషల్ మీడియా వేదికగా నెటిజన్లకు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. తనపై అకారణంగా బూతులతో దాడి చేసే వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఆమె తేల్చి చెప్పారు. ఇప్పటికే సైబర్ క్రైమ్ పోలీసుల సహకారంతో పలువురిని అరెస్ట్ చేయించిన రేణు, తాజాగా మరో వీడియో విడుదల చేస్తూ అబ్యూజ్ చేసే వారికి చుక్కలు చూపిస్తానని హెచ్చరించారు. సెలబ్రిటీల వ్యక్తిగత జీవితాలపై అసభ్యకరంగా కామెంట్స్ చేసే వారు ఇకనైనా మారతారా అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. సోషల్ మీడియాలో సెలబ్రిటీలను టార్గెట్ చేస్తూ బూతులు తిట్టడం కొందరికి ఫ్యాషన్‌గా మారింది. దీనిపై గతంలోనే లైవ్ పెట్టి హెచ్చరించిన రేణు దేశాయ్, చెప్పినట్టుగానే సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాజా సమాచారం ప్రకారం, ఈ కేసులో ఇప్పటికే ఆరుగురికి పైగా నెటిజన్లను పోలీసులు అరెస్ట్ చేశారు. “నేను ముందే చెప్పాను, నన్ను అకారణంగా దూషిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని. ఇక ఇప్పుడు అదే జరుగుతోంది. అరెస్టులు మొదలయ్యాయి, ఇవి ఇక్కడితో ఆగవు” అని రేణు దేశాయ్ స్పష్టం చేశారు. “ఎవరి గురించైనా పర్సనల్ గా తెలియకుండా బూతులు పెట్టడం వల్ల మీకు వచ్చే ఫేమ్ తాత్కాలికం, కానీ దాని వల్ల వచ్చే జైలు శిక్ష మీ జీవితాంతం బ్లాక్ మార్క్‌లా మిగిలిపోతుంది” అని రేణు వారిని ఉద్దేశించి హితవు పలికారు.



# శోభిత కొత్త సాహసం

అక్కినేని కోడలు, శోభిత ధూళిపాళ్ల తాజాగా చేసిన సాహసం చూసి అభిమానులు సైతం నోరెళ్ళబెడుతున్నారు. అసలు ఆమె ఎందుకు అంత సాహసం చేసింది అనే కామెంట్లు వ్యక్తం చేస్తున్నారు. అసలు విషయంలోకి వెళ్తే తాజాగా శోభిత ధూళిపాళ్ల తన సినిమా షూటింగ్ నుండి కాస్త విరామం దొరకడంతో వెకేషన్ కి వెళ్ళిపోయింది. అందులో భాగంగానే జలాంతర్గామిలోకి ప్రవేశించిన ఈమె అక్కడ అందమైన దృశ్యాలను క్యాప్చర్ చేసి వాటిని తన ఫోన్ లో భద్రంగా పొందుపరిచింది. ఇకపోతే చల్లని గాలులకు సముద్రపు అందాలను వీక్షిస్తూ ఇంస్టాగ్రామ్ వేదికగా పంచుకున్న ఆ ఫోటోలు సోషల్ మీడియాలో అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. చాలా రోజుల తర్వాత ఇలా ఇంస్టాగ్రామ్ లో బోట్ లో విహరిస్తూ షేర్ చేసిన ఫోటోలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. ఇక అలా సముద్రంలోకి ఆమె సాహసోపేతంగా దూకడం చూసి అభిమానులు ఆశ్చర్యపోతున్నారు.

# ‘బైకర్’ స్పీడ్ ఓవర్సీస్‌లో అదుర్స్!




శర్వానంద్ హీరోగా నటించిన యాక్షన్ ఎంటర్టైనర్ ‘బైకర్’ థియేటర్లలో సౌండ్ గట్టిగానే చేస్తోంది. ఇండియాలో ఫస్ట్ మోటో క్రాస్ రేసింగ్ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చిన సినిమా కావడంతో దీనిపై మొదటి నుంచే పాజిటివ్ బజ్ ఉంది. దానికి తోడు సీనియర్ హీరో రాజశేఖర్ తండ్రి పాత్రలో కనిపించడం సినిమాకు మరింత హైప్ తీసుకు వచ్చింది. ఈ సినిమా కేవలం ఇక్కడే కాకుండా ఓవర్సీస్ మార్కెట్‌లో కూడా బాక్సాఫీస్ దగ్గర తన బలాన్ని చాటుకుంటోంది. ముఖ్యంగా యూఎస్ బాక్సాఫీస్ వద్ద ఈ రేసింగ్ డ్రామాకు మంచి స్పందన లభిస్తుండటం విశేషం. అసలు విషయానికి వస్తే, ‘బైకర్’ చిత్రం ఓవర్సీస్ మార్కెట్‌లో 150కే డాలర్లమార్కును క్రాస్ చేసి సక్సెస్ ఫుల్ గా దూసుకుపోతోంది. శర్వానంద్ గత సినిమాలతో పోలిస్తే ఈ చిత్రానికి అక్కడ డీసెంట్ వసూళ్లు వస్తున్నాయి. కేవలం క్లాస్ ఆడియన్స్ మాత్రమే కాకుండా, స్పోర్ట్స్ థ్రిల్లర్లను ఇష్టపడే యువత కూడా థియేటర్లకు క్యూ కడుతున్నారు. శ్లోక ఎంటర్టైన్మెంట్స్ ఈ సినిమాను విదేశాల్లో భారీగానే విడుదల చేసింది. ఇప్పటి వరకు అందిన సమాచారం ప్రకారం, వసూళ్లు ఇంకా పెరుగుతూనే ఉన్నాయని, లాంగ్ రన్‌లో ఇది శర్వా కెరీర్‌లో ఒక మంచి ఓవర్సీస్ హిట్ గా నిలిచే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి.

# 15 ఏళ్లకే న్యూడ్ ఫోటో రిలీజ్ చేశారు: జాన్వీకపూర్



డీఫ్ ఫేక్ కారణంగా 15 ఏళ్ల వయసులో తనకొక చేదు సంఘటన ఎదురైందని నటి జాన్వీకపూర్ తాజాగా ఓ పాడ్‌కాస్ట్‌లో తెలిపారు. అశ్లీల వెబ్‌సైట్‌లో తన మార్ఫింగ్ ఫొటో చూసి షాకైనట్లు చెప్పారు. “దీనిని డీఫ్ ఫేక్ అంటారో లేదో నాకు తెలియదు కానీ, 15 ఏళ్ల వయసులో నాకు అలాంటి ఘటనే ఎదురైంది. అశ్లీల వెబ్‌సైట్‌లో ఎవరో నా ఫొటోను అప్‌లోడ్ చేశారు. అప్పుడు నేను స్కూల్‌లో చదువుకుంటున్నా. ఓసారి అశ్లీల వెబ్‌సైట్‌లో నా ఫొటో చూసినట్లు తెలిసిన వారు చెప్పారు. ఆక్షణం నాకేం అర్థం కాలేదు. నేనెంతో బాధపడ్డా. సోషల్‌మీడియాలో నైతికత లేదని అర్థమైంది. ఇలాంటి మూల్యం చెల్లించుకోక తప్పదని భావించా” అని జాన్వీకపూర్ అన్నారు. “డీఫ్ ఫేక్ కారణంగా ఇప్పటికీ సమస్యలు ఎదుర్కొంటున్నా. దీనివల్ల నాకు ప్రశాంతత లేకుండా పోయింది. కొన్నిసార్లు అధికారిక న్యూస్ పేజీలు కూడా నా ఏఐ ఇమేజ్‌లను ఒరిజినల్ అనుకుని వాడేస్తుంటాయి. ఆ ఫొటోలు చూసి షాకవుతుంటా. ఆయా ఫొటోలు నేనే అధికారికంగా షేర్ చేసినట్లు ప్రచారం జరుగుతుంటుంది. దీనివల్ల వర్క్ లైఫ్‌లో సమస్యలు కూడా వస్తుంటాయి. ఈ డీప్‌ఫేక్ వల్ల పడుతున్న బాధను బయటకు వచ్చి చెప్పాలని ఉంటుంది. కాకపోతే నాకంత వాయిస్ లేదని అనిపిస్తుంటుంది” అని ఆమె వివరించారు. సినిమాల విషయానికి వస్తే ప్రస్తుతం ఆమె ‘పెద్ది’ కోసం వర్క్ చేస్తున్నారు.

# జయమ్మగా రష్మిక మందన్నా

రష్మిక పుట్టినరోజు సందర్భంగా రణబాలి మూవీ టీమ్ స్పెషల్ విషెస్ తెలియజేసింది. ‘పచ్చి పసుపు కొమ్మ.. మా జయమ్మ’ అంటూ ఎమోషనల్ మెసేజ్ తోపాటు ఒక స్పెషల్ వీడియోను విడుదల చేసింది. ఆ వీడియోలో రష్మిక సెట్స్ కు చేరుకున్నప్పుడు టీమ్ ఆమెకు స్వాగతం పలకడం, పాత్ర గురించి డైరెక్టర్ వివరించడం, రష్మిక జయమ్మ గెటప్ లోకి మారడం వంటి బ్యూటిఫుల్ మూమెంట్స్ చూపించారు. అంతే కాదు.. సినిమాలోని ఏందయ్యా పాటలో విజయ్, రష్మికకు సంబంధించిన విజువల్స్ ను కూడా యాడ్ చేశారు. ఆ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతూ అభిమానులను ఆకట్టుకుంటోంది. సూపర్ జయమ్మ.. హ్యాపీ బర్త్ డే జయమ్మ అంటూ నెటిజన్లు, సినీ ప్రియులు, ఫ్యాన్స్ కామెంట్లు పెడుతున్నారు. అయితే సినిమాలో రష్మిక జయమ్మ అనే పవర్ ఫుల్ గ్రామీణ యువతి పాత్రలో కనిపించనున్నారు. ఇటీవల అనంతపురం, రాయలసీమ ప్రాంతాల్లో భారీ షెడ్యూల్ పూర్తయింది. అక్కడి ప్రజలు చూపించిన ఆదరణకు విజయ్, రష్మిక ప్రత్యేక వీడియో ద్వారా అభిమానులకు ధన్యవాదాలు చెప్పారు.





# సంగీత్ నాకు కొడుకు లాంటివాడు:మానస శర్మ

తెలుగు చలనచిత్ర పరిశ్రమలో దర్శకురాలిగా తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర వేసుకుంటున్నారు మానస శర్మ. ఇటీవలే ఆమె దర్శకత్వంలో విడుదలైన ‘రాకాస’ సినిమా థియేటర్లలో సూపర్ హిట్ టాక్‌తో దూసుకుపోతోంది. ఈ సంతోషకర సమయంలో ఆమె ఒక ఇంటర్వ్యూలో పాల్గొని, యువ హీరో సంగీత్ శోభన్‌తో తనకున్న ఐదేళ్ల అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. సంగీత్ తన సొంత కొడుకు లాంటివాడని చెబుతూ ఆమె చేసిన ఎమోషనల్ కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. దర్శకురాలు మానస శర్మ, హీరో సంగీత్ శోభన్ మధ్య ఉన్న బాండింగ్ ఈనాటిది కాదు. గత ఐదేళ్లుగా వీరిద్దరి మధ్య మంచి స్నేహం ఉంది. మొదట్లో వీరిద్దరూ కలిసి ఒక చిన్న సినిమా చేసినప్పుడు, సంగీత్‌ను ఆమె తన తమ్ముడిలా భావించేవారట. కానీ కాలక్రమేణా ఆ అనుబంధం మరింత బలపడి ఇప్పుడు కొడుకు స్థాయికి చేరిందని మానస ఎమోషనల్ అయ్యారు. “భవిష్యత్తులో నాకు పిల్లలు పుడితే సంగీత్ లాంటి పిల్లాడే కావాలని కోరుకుంటాను” అని ఆమె పేర్కొన్నారు.



# అవి కామనే: పూజాహెగ్డే

తెలుగులో అవకాశాలు తగ్గడంతో పూజా హెగ్డే ఇతర భాషల వైపు దృష్టి మళ్లించారు. హిందీ, తమిళ చిత్రాల్లో చిన్న చిన్న పాత్రలు, స్పెషల్ సాంగ్స్ చేస్తూ ప్రేక్షకులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. అయినప్పటికీ, తెలుగులో ఆమె కనిపించి చాలా కాలం కావడంతో అభిమానులు మళ్లీ ఎప్పుడు పెద్ద సినిమాతో వస్తుందా అని ఎదురుచూస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో తన కెరీర్ పై వస్తున్న వ్యాఖ్యలపై రీసెంట్ గా ఓ ఇంటర్వ్యూలో స్పందించిన పూజా హెగ్డే.. సినిమా ఇండస్ట్రీలో హిట్స్, ఫ్లాప్స్ చాలా కామన్ అని తెలిపారు. ఒక సినిమా హిట్ అయితే మరొకటి ఫ్లాప్ కావడం సహజమేనని చెప్పారు. వాటిని ఈక్వల్ గా స్వీకరించాల్సిందేనని ఆమె అన్నారు. కెరీర్ లో ఇలాంటి అప్స్ అండ్ డౌన్స్ ప్రతి ఒక్కరికి ఉంటాయని చెప్పిన ఆమె, వాటిని అధిగమిస్తూ ముందుకు సాగడం ముఖ్యమని తెలిపారు. తాను ప్రస్తుతం పలు సినిమాలతో బిజీగా ఉన్నానని పూజా హెగ్డే వెల్లడించారు.






# సొంతగడ్డపై ఆర్సీబీ విన్



## డేవిడ్ సిక్సర్ల మోత.. అల్లాడిన చెన్నై సూపర్ కింగ్స్.

**సొంత ఇలాకాలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు గర్జించింది. చిన్నస్వామి స్టేడియంలో బ్యాటర్ల ఊచకోతకు, బౌలర్ల వికెట్ల వేట తోడవ్వగా ఆర్సీబీ పరుగులతో భారీ విజయం సాధించింది. టిమ్ డేవిడ్(70 నాటౌట్), దేవ్‌దత్ పడిక్కల్(50) మెరుపులతో కొండంత స్కోర్ కొట్టిన బెంగళూరు.. పవర్ ప్లేలోనే చెన్నై సూపర్ కింగ్స్‌ను ఓటమి అంచుల్లోకి నెట్టింది. టాపార్డర్ కుప్పకూలిన చోట సర్ఫరాజ్ ఖాన్(50), ప్రశాంత్ వీర్(43)లు బ్యాట్ ఝులిపించారు. ఆఖర్లో జేమీ ఓవర్టన్(37) ధనాధన్ ఆడినా సరిపోలేదు. ఫలితంగా చెన్నై ఖాతాలో హ్యాట్రిక్ ఓటమి చేరింది.**

పంతొమ్మిదో సీజన్‌లో రికార్డు స్కోర్ బాదిన ఆర్సీబీ వరసగా రెండో విజయం నమోదు చేసింది. చిన్నస్వామి స్టేడియంలో ప్రత్యర్థి నిర్దేశించిన కొండంత లక్ష్యాన్ని చూసి నీరుగారిపోయిన సూపర్ కింగ్స్ ఏ దశలోనూ గెలుపు దిశగా సాగలేదు. బౌలర్లు విఫలమైన చోట బ్యాటర్లూ 'మేము ఆడలేమంటూ' చేతులెత్తేశారు. జాకబ్ డఫ్ఫీ వేసిన తొలి ఓవర్లో సిక్సర్ బాదిన రుతురాజ్ గైక్వాడ్(7) సులువుగా వికెట్ ఇచ్చేయగా.. గత మ్యాచ్‌లో అర్ధ శతకంతో రెచ్చిపోయిన ఆయుష్ మాత్రే(1)ను భువనేశ్వర్ ఔట్ చేశాడు. భారీ స్కోర్ బాకీ పడిన సంజూ శాంసన్ మరోసారి నిరాశపరుస్తూ 9 పరుగులకే వెనుదిరిగాడు. డఫ్ఫీ, భువనేశ్వర్‌ల విజృంభణతో 30 కే మూడు బిగ్ వికెట్లు పడిన వేళ సర్ఫరాజ్ ఖాన్(50), ఇంపాక్ట్ సబ్ కార్తిక్ శర్మ(6)లు బౌండరీలతో స్కోర్ బోర్డును నడిపించారు. అయితే.. కృనాల్ పాండ్యా(2-36) ఒకే ఓవర్లో వీరిద్దరని పెవిలియన్ పంపి చెన్నైని మరింత కష్టాల్లోకి నెట్టాడు. శివం దూబే(18) కాసేపు అలరించాడంతే. ప్రశాంత్ వీర్(43), జేమీ ఓవర్టన్(37)లు ఆర్సీబీ బౌలర్లను ప్రతిఘటించారు. స్కోర్ 100 దాటించి ఆరో వికెట్‌కు 57 రన్స్ జోడించిన ఈ ద్వయాన్ని డైవింగ్ క్యాచ్‌తో పాటిదార్ విడదీశాడు. కాసేపటికే ఓవర్టన్ ఇన్నింగ్స్ ముగియగా.. సీఎస్కే 207 పరుగులకే పరిమితమైంది. సొంత గడ్డపై రాయల్ ఛాలెంజర్స్ బ్యాటర్లు పూనకాలు వచ్చినట్టే చెలరేగారు. ఓపెనర్లు శుభారంభమివ్వగా.. దానికి రెండింతలు అన్నట్టు మిడిలార్డర్ బ్యాటర్లు సుడిగాలి ఇన్నింగ్స్‌తో చెన్నై సూపర్ కింగ్స్ బౌలర్ల భరతం పట్టారు. ఫలితంగా ఈ సీజన్‌లో అత్యధిక స్కోర్ నమోదు చేసింది ఆర్సీబీ. పవర్ ప్లేలోనే విరాట్ కోహ్లీ(28) ఔటైనా.. దేవ్‌దత్ పడిక్కల్(50) జతగా ఫిలిప్ సాల్ట్(46) స్కోర్ బోర్డును ఉరికించాడు. అర్ధ శతకానికి చేరువైన సాల్ట్‌ను దూబే వెనక్కి పంపాడు. అనంతరం పడిక్కల్‌తో కెప్టెన్ రజత్ పాటిదార్(48 నాటౌట్) సూపర్ కింగ్స్ బౌలర్లను చెడుగుడు ఆడుకున్నాడు. ఓవర్టన్ ఓవర్లో స్కూప్ షాట్‌కు యత్నించిన పడిక్కల్ బౌల్డ్ అయ్యాడు. అయినా.. ఆర్సీబీ స్కోర్ వేగం తగ్గలేదు. చివరి ఐదు ఓవర్లలో టిమ్ డేవిడ్(70 నాటౌట్) ఆకాశమే హద్దుగా.. సిక్సర్లే సిక్సర్లు బాదేశాడు. 16వ ఓవర్ నుంచి మొదలైన అతడి దూకుడు చివరి ఓవర్ వరకూ కొనసాగింది. దాంతో.. ఆర్సీబీ నిర్ణీత ఓవర్లలో వికెట్ల నష్టానికి 250 పరుగుల భారీ స్కోర్ చేసింది.



## రోహిత్ రికార్డు తిరగరాసిన కోహ్లీ

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ టీ20 క్రికెట్‌లో సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఒకే ప్రత్యర్థిపై అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. ఐపీఎల్ 2026లో భాగంగా చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్కే)తో జరిగిన మ్యాచ్‌లో ఈ ఘనత సాధించాడు. ఈ మ్యాచ్‌లో 28 పరుగులు చేయడం ద్వారా హిట్ మ్యాన్ రోహిత్ శర్మ పేరిట ఉన్న రికార్డును కోహ్లీ తిరగరాశాడు. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌కు ముందు, కోల్‌కతా నైట్ రైడర్స్‌పై 1,161 పరుగులతో రోహిత్ శర్మ ఈ రికార్డును కలిగి ఉన్నాడు. తాజా ఇన్నింగ్స్‌తో చెన్నైపై కోహ్లీ మొత్తం పరుగుల సంఖ్య 1,188కి చేరింది. దీంతో టీ20 ఫార్మాట్‌లో ఒకే జట్టుపై అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా విరాట్ అగ్రస్థానంలో నిలిచాడు. ఆసక్తికరంగా, ఈ జాబితాలో పంజాబ్ కింగ్స్‌పై 1,159 పరుగులతో కోహ్లీ మూడో స్థానంలో కూడా ఉండటం విశేషం. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన ఆర్సీబీ నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 250 పరుగుల భారీ స్కోరు చేసింది. ఇది ఈ సీజన్‌లో ఇప్పటివరకు నమోదైన అత్యధిక స్కోరు. దేవదత్ పడిక్కల్ (50), ఫిలిప్ సాల్ట్ (46) శుభారంభం అందించగా, కెప్టెన్ రజత్ పటిదార్ (48), టిమ్ డేవిడ్ (70) ఆకాశమే హద్దుగా చెలరేగారు. ఈ ఇద్దరూ కేవలం 36 బంతుల్లోనే 99 పరుగులు జోడించారు.

## నలుగురు బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు డైరెక్టర్ల రాజీనామా

బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) తీవ్ర సంక్షోభంలో చిక్కుకుంది. శనివారం ఒక్కరోజే నలుగురు డైరెక్టర్లు రాజీనామా చేయడంతో బోర్డులో ప్రకంపనలు మొదలయ్యాయి. ఆరు నెలల క్రితం బాధ్యతలు స్వీకరించిన డైరెక్టర్ల బృందంలో ఇప్పటివరకు ఏడుగురు తప్పుకోవడంతో బంగ్లా క్రికెట్ భవిష్యత్తుపై ఆందోళన నెలకొంది. ఈ పరిణామాల మధ్య, తాను మాత్రం రాజీనామా చేసేది లేదని బీసీబీ అధ్యక్షుడు అమీనుల్ ఇస్లామ్ స్పష్టం చేశారు. "ఒకవేళ నేను కూడా రాజీనామా చేయాల్సి వస్తే చివరి వ్యక్తిగానే వెళతాను" అని ఆయన తేల్చిచెప్పారు. శనివారం జరిగిన బోర్డు సమావేశం అనంతరం డైరెక్టర్లు సనియన్ తనీమ్, మెహ్రాబ్ అలం, ఫైయాజుర్ రహ్మాన్, మంజురుల్ అలం తమ పదవులకు రాజీనామా చేశారు. అంతకుముందే మరో ముగ్గురు కూడా వైదొలిగారు. దీంతో 25 మంది సభ్యులున్న బోర్డులో అస్థిరత ఏర్పడింది. ఈ పరిణామాలపై బీసీబీ అధ్యక్షుడు అమీనుల్ ఇస్లామ్ ఆదివారం స్పందించారు. తన బృందం నిజాయతీపరులతో కూడినదని, వారితోనే బంగ్లాదేశ్ క్రికెట్‌కు సేవ చేయాలనుకుంటున్నానని అన్నారు. గత ఏడాది జరిగిన బీసీబీ ఎన్నికల్లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై బంగ్లాదేశ్ ప్రభుత్వం విచారణ కమిటీని నియమించింది. ఈ కమిటీ ఇప్పటికే ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. ఎన్నికల ప్రక్రియలో తన ప్రమేయం పరిమితమని, రాజ్యాంగ ప్రకారమే నడుచుకున్నానని అమీనుల్ వివరణ ఇచ్చారు. మరోవైపు, క్రీడా మంత్రిత్వ శాఖ ఎన్నికల చెల్లుబాటుపై ప్రశ్నలు లేవనెత్తడం, టీ20 ప్రపంచకప్‌లో బంగ్లాదేశ్ పాల్గొనకపోవడం వంటి అంశాలు బోర్డుపై ఒత్తిడిని పెంచుతున్నాయి. బయటి శక్తుల జోక్యం వల్లే బంగ్లాదేశ్ క్రికెట్ స్తంభించిపోయిందని అమీనుల్ ఆరోపిస్తున్నారు. వరుస రాజీనామాలు, ప్రభుత్వ విచారణ నేపథ్యంలో బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది.

## పంత్ కష్టం నాకే తెలుసు: యువరాజ్

టీమిండియా మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్, ఫామ్ కోల్పోయి ఇబ్బంది పడుతున్న వికెట్ కీపర్-బ్యాటర్ రిషభ్ పంత్‌కు అండగా నిలిచాడు. లక్నో సూపర్ జెయింట్స్ (ఎల్ఎస్‌జీ) జట్టుకు కెప్టెన్‌గా ఉన్న పంత్.. ఇటీవల ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 9 బంతుల్లో కేవలం 7 పరుగులు మాత్రమే చేసి విఫలమవడంతో అతనిపై విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో యువరాజ్ స్పందిస్తూ పంత్‌కు బాసటగా నిలిచాడు. స్పోర్ట్స్ తక్‌తో మాట్లాడుతూ యువరాజ్ కీలక వ్యాఖ్యలు చేశాడు. "పంత్ ప్రాణాంతక ప్రమాదం నుంచి బయటపడ్డాడు. నేను కూడా అలాంటి అనుభవాన్నే ఎదుర్కొన్నాను. కాబట్టి అతని పరిస్థితిని నేను అర్థం చేసుకోగలను. ప్రస్తుతం అతని మానసిక స్థితి ఎలా ఉందో చాలా మందికి అర్థం చేసుకోవడం కష్టం" అని యువరాజ్ అభిప్రాయపడ్డాడు. పంత్ ఎదుర్కొంటున్న కష్టాలను సామాన్యులు అర్థం చేసుకోలేరని యువీ పేర్కొన్నాడు. గత రెండేళ్లుగా పంత్ ఎన్నో ఇబ్బందులు పడ్డాడని, కారు ప్రమాదం తర్వాత పలు గాయాలు, సైడ్ స్ట్రెయిన్, ఫుట్ ఫ్రాక్చర్ వంటివి అతడిని వేధించాయని యువరాజ్ తెలిపాడు. వీటివల్ల తన రిథమ్, ఆత్మవిశ్వాసం దెబ్బతిన్నాయని వివరించాడు. ఈ ఐపీఎల్ సీజన్‌కు ముందు యువరాజ్ వద్ద పంత్ శిక్షణ తీసుకున్నాడు. ఆ సమయంలో తమ మధ్య కీలక సంభాషణలు జరిగాయని అన్నాడు.





## ఉత్కంఠ పోరులో లక్నో విజయం

**చివరి వరకు పోరాడిన సన్‌రైజర్స్**

సొంతగడ్డపై సన్‌రైజర్స్ హైదరాబాద్ వీరోచితంగా పోరాడినా ఓటమి నుంచి తప్పించుకోలేకపోయింది. ఆఖరి ఓవర్ వరకు ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. కెప్టెన్ రిషభ్ పంత్ (68 నాటౌట్) బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్‌తో లక్నోను గెలిపించాడు. 157 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన లక్నోకు మంచి ఆరంభం లభించింది. ఎయిడెన్ మార్‌క్రమ్ (45) వేగంగా ఆడాడు. అయితే, సన్‌రైజర్స్ బౌలర్లు కట్టుదిట్టంగా బంతులేయడంతో మధ్యలో వికెట్లు కోల్పోయి ఒత్తిడికి గురైంది. కానీ, ఒకవైపు వికెట్లు పడుతున్నా కెప్టెన్ రిషభ్ పంత్ చివరి వరకు క్రీజులో నిలబడి జట్టును విజయతీరాలకు చేర్చాడు. 50 బంతుల్లో 9 ఫోర్లతో 68 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఆఖరి ఓవర్ లో లక్నో విజయానికి 9 పరుగులు కావాల్సి ఉండగా... పంత్ రెండు ఫోర్లు కొట్టడంతో స్కోరు సమం అయింది. 4 బంతుల్లో 1 పరుగు కావాల్సి ఉండగా... ఉనద్కట్ రెండు డాట్ బాల్స్ విసరడంతో ఉత్కంఠ పెరిగిపోయింది. మ్యాచ్ సూపర్ ఓవర్ కు దారితీస్తే బాగుండని సన్ రైజర్స్ అభిమానులు కోరుకున్నారు. అయితే, పంత్ మరో బౌండరీ కొట్టడంతో మ్యాచ్ సన్ రైజర్స్ చేజారింది. లక్నో 19.5 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. సన్‌రైజర్స్ బౌలర్లలో హర్ష్ దూబే 2 వికెట్లు తీశాడు. అంతకుముందు, టాస్ గెలిచిన లక్నో బౌలింగ్ ఎంచుకుంది. మహమ్మద్ షమీ (2/9) నిప్పులు చెరిగే బౌలింగ్‌తో సన్‌రైజర్స్ టాప్ ఆర్డర్‌ను కుప్పకూల్చాడు. ట్రావిస్ హెడ్ (7), అభిషేక్ శర్మ (0), ఇషాన్ కిషన్ (1) స్వల్ప స్కోర్లకే వెనుదిరగడంతో, పవర్ ప్లే ముగిసేసరికి రైజర్స్ 26 పరుగులకే 4 కీలక వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో క్రీజులో కలిసిన హెన్రిచ్ క్లాసెన్, నితీశ్ కుమార్ రెడ్డి చరిత్రలో నిలిచిపోయే భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. వీరిద్దరూ లక్నో బౌలర్లపై ఎదురుదాడికి దిగి స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. ఈ జోడీ ఐదో వికెట్‌కు 116 పరుగులు జోడించడంతో సన్‌రైజర్స్ కోలుకుంది. క్లాసెన్ 41 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో 62 పరుగులు చేయగా, నితీశ్ రెడ్డి 33 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్సర్లతో 56 పరుగులు సాధించాడు. దీంతో సన్‌రైజర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 156 పరుగులు చేసింది.



## ధోనీ ఎంట్రీకి టైం పట్టొచ్చు: గైక్వాడ్

పంతొమ్మిదో సీజన్‌లో బోణీ కోసం నిరీక్షిస్తున్న చెన్నై సూపర్ కింగ్స్‌కు మరో షాక్. అనుభవజ్ఞుడు, మాజీ సారథి మహేంద్ర సింగ్ ధోనీ రెండు వారాల కంటే ఎక్కువ రోజులే ఐపీఎల్‌కు దూరమయ్యే అవకాశముంది. చిన్నస్వామిలో ఆదివారం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో మ్యాచ్ టాస్ సందర్భంగా ధోనీ గురించి చెన్నై కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ కీలక విషయం వెల్లడించాడు. ఐపీఎల్ ఆరంభ నుంచి ఆడుతున్న ధోనీ ఈసారి ఇంకా మైదానంలోకి దిగలేదు. టోర్నీ మొదలై వారం కావొస్తున్నా తాలా పునరాగమనంపై ఉత్కంఠ కొనసాగుతోంది. మొదట రెండువారాలే అందుబాటులో ఉండడని సూపర్ కింగ్స్ యాజమాన్యం చెప్పినా.. ఆ సమయం మరింత పెరిగేలా కనిపిస్తోంది. స్వయంగా ఆ జట్టు కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ టాస్ సందర్భంగా ధోనీ గురించి బిగ్ అప్డేట్ ఇచ్చాడు. 'ధోనీ నెమ్మదిగా కోలుకుంటున్నాడు. కొన్నిసార్లు మరింత సమయం పట్టొచ్చు. అతడు మ్యాచ్ ఆడేందుకు సిద్ధంగా ఉంటే కచ్చితంగా ఆడిస్తాం. అయితే.. అందుకు కాస్త టైమ్ పట్టేలా ఉంది' అని గైక్వాడ్ తెలిపాడు. కెప్టెన్‌గా ఐదు ట్రోఫీలు కట్టబెట్టిన ధోనీ గైర్హాజరీలో సీఎస్కే పరాజయాల పరంపర కొనసాగుతోంది. తొలి పోరులో రాజస్థాన్ రాయల్స్.. రెండో మ్యాచ్ పంజాబ్ ధాటికి చెన్నై తేలిపోయింది.

ఈవార్తలు
# ప్రజావాణి
www.evarthalu.com
నేటి ఈవార్తలు
సోమవారం 6-4-2026, జగిత్యాల

నేటి ఈవార్తలు

సంపాదకీయం Editorial

## నవ భారతానికి నవ ‘శక్తి’

భారత ప్రజాస్వామ్య ప్రస్థానంలో మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందడం అనేది ఒక చట్టపరమైన ప్రక్రియ మాత్రమే కాదు, అది సామాజిక న్యాయం, లింగ సమానత్వం దిశగా పడిన ఒక విప్లవాత్మక అడుగు. దాదాపు మూడు దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ, కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును చట్టరూపంలోకి తెచ్చేందుకు ఏప్రిల్ 16 నుండి 18 వరకు ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలను నిర్వహించాలని నిర్ణయించడం మహిళా సాధికారత పట్ల ఉన్న చిత్తశుద్ధిని చాటుతోంది. 1996లో తొలిసారిగా ప్రవేశపెట్టిన ఈ బిల్లు, రాజకీయ ఏకాభిప్రాయం లేక ఎన్నో ఏళ్లుగా నలుగుతూనే ఉంది. అయితే, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం దీనిని నారీ శక్తి వందన్ అధినియం (రాజ్యాంగ 106వ సవరణ చట్టం, 2023) పేరుతో లోక్‌సభ, రాజ్యసభల్లో ఏకగ్రీవంగా ఆమోదింపజేయాలని చూస్తోంది. ఈ చట్టం ద్వారా లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు 33 శాతం సీట్లు దక్కుతాయి. ప్రస్తుతం ఈ కోటాను 2029 సాధారణ ఎన్నికల నుంచే అమలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం నియోజకవర్గాల పునర్విభజన, జనాభా గణన ప్రక్రియలను వేగవంతం చేసేందుకు అవసరమైన సవరణలను ఈ ప్రత్యేక సమావేశాల్లో చర్చించనున్నారు.

సంఖ్యాపరమైన ప్రాతినిధ్యమే కాకుండా, నిర్ణయాధికారాల్లోనూ మహిళల భాగస్వామ్యం పెరగడం వల్ల దేశ అభివృద్ధిలో నూతన దృక్పథాలు చోటు చేసుకుంటాయి. ఈ ప్రక్రియలో నియోజకవర్గాల పునర్విభజన వల్ల కొన్ని రాష్ట్రాల సీట్లు తగ్గుతాయన్న ఆందోళనలను ప్రభుత్వం ఇప్పటికే పరిగణనలోకి తీసుకుంది. ఎవరికీ అన్యాయం జరగకుండా, దేశ ప్రయోజనాలే పరమావధిగా ఈ చట్టాన్ని అమలు చేయాల్సిన బాధ్యత అందరిపై ఉంది. చట్టసభల్లో మహిళల భాగస్వామ్యం పెరగడం అంటే ప్రజాస్వామ్యం మరింత బలోపేతం కావడం. ఏ దేశమైనా సగం జనాభా ఉన్న మహిళల సహకారం లేకుండా ప్రగతి సాధించలేదు. ఈ చట్టం అమల్లోకి వస్తే, అది భారతదేశానికి మాత్రమే కాదు, ప్రపంచ దేశాలన్నింటికీ ఒక దిక్సూచిగా మారుతుంది. ఇది మాటలకే పరిమితం కాకుండా, కార్యాచరణలోనూ ‘నవ భారత నారీ’ సత్తాను చాటిచెప్పే సమయం ఆసన్నమైంది.

# కురుక్షేత్రం..

# ఆ 18 రోజులు



ఒక కుటుంబం..
అన్నదమ్ముల మధ్య అధికార తగాదా..
చిలికి చిలికి గాలివానగా మారింది.
అన్న భార్యను తమ్ముడు అవమానించాడు..
ఇంకేం యుద్ధమేఘాలు కమ్ముకున్నాయి.
ఇరువర్గాలూ రణరంగానికి సర్వం సన్నద్ధమయ్యాయి.
అధికారం అన్నదమ్ముల మధ్య చిచ్చు పెట్టింది.
అహంకారం పగల్ని రగిల్చింది.
మహా మారణహోమాన్ని సృష్టించింది.

ప్రపంచ నాగరిక చరిత్రలో కనీవినీ ఎరుగని సామూహిక జనహననం అది. ఒక కుటుంబం కోసం ఒక దేశం బలైపోయింది. రాజరికపు దుష్టజూదానికి సామంత రాజ్యాలు హరించుకుపోయాయి. మాయదారి యుద్ధం లక్షల మందిని పొట్టన పెట్టుకుంది. ఇదంతా అయిదున్నర వేల సంవత్సరాల క్రితం జరిగిన కథ.. మన దేశంలోనే జరిగిన కథ ఇన్ని వేల సంవత్సరాల తరువాత కూడా ఇప్పటి రాజకీయ వ్యవస్థ సైతం అనుసరిస్తున్న రాజనీతిని అందించిన చరిత్ర. ఇది మహాభారత గాథ.. అయిదుగురు పాండవులు, నూరుగురు కౌరవులను అతి తేలిగ్గా ఓడించిన ఇతిహాసం. తమ రాజ్యాధికారాన్ని అన్యాయంగా స్వాధీనం చేసుకున్న కౌరవులపై పాండవులు ప్రతీకారం తీర్చుకున్న కథ. తమ భార్యను పదిమందిలో వివస్త్రను చేసేందుకు యత్నించిన దుర్మార్గులను పాండవులు మట్టుబెట్టిన కథ. వార్ హెడ్ విమానాలు.. వైమానిక దాడులు.. జీవరసాయన ఆయుధాలు.. అణ్వస్త్ర ప్రయోగాలు. రోజుకు రెండు లక్షల మంది.. 18 రోజుల్లో 36 లక్షల మంది.. మహా మారణ హోమంలో సామూహిక జన హననం.. ప్రళయాన్ని సృష్టించిన మహా యుద్ధం.. కురుక్షేత్రం. తొలి ప్రపంచ సంగ్రామం ఎక్కడ జరిగిందో తెలుసా? 1914 అని జికె తెలిసిన కుర్రోళ్లు ఠక్కున చెప్పేస్తారు.. కానీ, అది తప్పు.. ముమ్మాటికీ తప్పే.. మొదటి ప్రపంచ సంగ్రామం క్రీస్తుపూర్వం 3138లో జరిగింది. అదీ మన దేశంలో, భారత ఉపఖండంలో– రెండు కుటుంబాల మధ్య జరిగిన యుద్ధం, రెండు ప్రపంచ సంగ్రామాల కంటే దారుణమైన వినాశనాన్ని సృష్టించింది. అంతకు ముందు, ఆ తరువాత, ఇవాల్టికి సైతం కనీవినీ ఎరుగని బాంబు పేలుళ్లతో ప్రళయాన్ని సృష్టించిన మహా సంగ్రామానికి మనమే వారసులం. కేవలం 18 రోజుల్లో మానవ సమూహమే నాశనమైపోయింది. మానవ జాతికి మరపునకు రాని చరిత్రను అందించిన మహాయుద్ధం అది. దాయాదుల మధ్య అధికార కాంక్షతో అంతులేని మారణకాండ జరిగిపోయింది. క్రీస్తు పూర్వం 3138, డిసెంబర్ 25, మంగళవారం, మార్గశిర మాసం, శుక్లపక్షం, త్రయోదశి మహా సంగ్రామానికి ముహూర్తం కుదిరింది. ఈ ముహూర్త బలం వల్లనేమో 18 రోజుల్లో 36 లక్షల మంది హతమయ్యారు. ఈ యుద్ధంలో అత్యాధునిక ఆయుధాలు ఉపయోగించారు. అణ్వస్త్రాలు, జీవ రసాయనాయుధాలు, ఎయిర్ బ్యాటిల్, ఈనాటి అగ్రరాజ్యాలను సైతం నివ్వెరపరిచే ఆధునిక యుద్ధ తంత్రాలు ప్రయోగించారు. నేటి ప్రపంచానికి యుద్ధ నీతిని అందించిన మహారణం ఈ కురుక్షేత్రం. అణ్వస్త్రం.. అమెరికా వాడు తయారు చేశాడు.. చంద్రుడి మీదకు అమెరికా వాడు ముందు వెళ్లాడు.. యుద్ధం చేయటం అమెరికా వాడికే తెలుసు.. ప్రజాస్వామ్యం అమెరికా నుంచి నేర్చుకోవాలి.. నియంతృత్వం అమెరికా నుంచే తెలుసుకోవాలి.. పసుపుపై పేటెంటు అమెరికాదే.. ప్రపంచంపై పేటెంటు అమెరికాదే.. ప్రపంచ పోలీసు సర్వాంతర్యామి.. మనది కొంచెం తెలివైతే.. వాడిది అతి తెలివి.. ఇదంతా దేనికని అనుకోకండి.. ఇప్పు దున్న ట్రెండ్ అలాంటిది.. ప్రపంచంలో అన్నీ అమెరికాలోనే పుట్టాయనుకునే జనరేషన్ మనది.. కానీ, సోకాల్డ్ అమెరికా వంటి ప్రపంచ దేశాలన్నింటికీ మించిన సాఫిస్టికేటెడ్ టెక్నాలజీలో మనం ఎంతో ముందున్నామన్న నిజం తెలుసా? మహా భారత యుద్ధమే ఇందుకు తార్కాణం. ఒక పర్ఫెక్ట్ వార్ టెక్నాలజీకి మోడల్గా మహాభారత యుద్ధాన్ని చెప్పుకోవచ్చు. ఇవాల్టికి 5150 ఏళ్ల కింద జరిగిన మహాభారత యుద్ధాన్ని గురించి పెద్ద ఎత్తున పరిశోధనలు జరిగాయి. మహాభారత ఇతిహాసంలో చెప్పిన అంశాలు, న్యూఢిల్లీ, దాని చుట్టు పక్కల ప్రాంతాల్లో, హరప్పా, మొహంజదారో నాగరికతలు వెలువడ్డ ప్రాంతాల్లో ప్రపంచ ప్రసిద్ధులైన ఆర్కియాలజిస్టుల రీసర్చ్ మహాభారత యుద్ధం నాటి అనేక విషయాలను వెలుగులోకి తీసుకువచ్చాయి.

ఏన్షియంట్ వార్లో అత్యంత శక్తిమంతమైన బాంబు పేలుళ్లు జరిగాయి. అర్జునుడు అణ్వస్త్రాన్ని ప్రయోగించినట్లు తెలుస్తోంది. యుద్ధం జరిగింది 18 రోజులే అయినా. అయిదువేల ఏళ్ల తరువాత కూడా దాని రేడియేషన్ ప్రభావం సజీవంగా కనిపించటం విశేషం. కురుక్షేత్రంలో జరిగిన యుద్ధంలో ఊహకందని అంశాలు కనిపిస్తాయి. వివిధ దేశాలు ఇవాల్టి ఆర్మీలో అనుసరిస్తున్న అనేక విభాగాలు కౌరవ, పాండవుల సైన్యంలో మనకు కనిపిస్తాయి. ఆనాటి ఒక ఆర్మీవింగ్ను అక్షౌహిణి అని పిలిచేవారు. ఒక అక్షౌహిణిలో 1,09,000వేల మంది సైనికులు, 21,870 రథాలు, 21,870 యుద్ధ ఏనుగులు, 65, 610 హార్స్ రైడర్లు ఉంటారు. ఆర్మీ జనరల్గా మహా సేనాపతి ఉంటాడు. ఆయన కింద లెఫ్టినెంట్ జనరల్, మేజర్ జనరల్, బ్రిగేడియర్, కల్నల్, లెఫ్టినెంట్ కల్నల్, మేజర్, కెప్టెన్, లెఫ్టినెంట్లుగా రకరకాల స్థాయిల్లో సైనికాధికారులు ఉండేవారు. కాకపోతే అప్పటి పేర్లు వేరు. ఇప్పటి పేర్లు వేరు. సైన్యం మోహరింపు కూడా స్పెసిఫిక్ వ్యూహం ప్రకారం ఉండేది. ఒక రథం, ఒక వార్ ఎలిఫెంట్, ముగ్గురు హార్స్ రైడర్లు, అయిదుగురు సైనికులు ఇది ఒక టీమ్ అన్నమాట. ఇదేమీ ఆషామాషీ మోహరింపు కాదు. ఒకసారి ఈ సైనిక వ్యూహంలో చిక్కుకున్నవాడు ఎంత గొప్పవాడైనా సరే ప్రాణాలతో బయటకు రావటం ఈజీ కాదు. అభిమన్యుడు ఇలాంటి పద్మవ్యూహంలో చిక్కుకుని ప్రాణాలు పోగొట్టుకున్నవాడే. యుద్ధంలో ఎత్తుకు పైఎత్తులు, కూటనీతి, మోసాలు, పవర్ ఆఫ్ వెపన్స్ వంటివన్నీ మహాభారత యుద్ధంలో స్పష్టంగా కనిపిస్తాయి. ఆధునిక యుద్ధవ్యూహాలు కురుక్షేత్ర యుద్ధం ముందు ఎందుకూ కొరగావు. కురుక్షేత్ర యుద్ధం నాటికి కౌరవ పాండవ సైన్యాలు ఆనాటికి అత్యంత ఆధునికమైన ఆయుధ సంపత్తిని సమకూర్చుకున్నాయి. ఇవాళ మనం ఏలియన్గా పిలుచుకునే గ్రహాంతర వాసులు వారికి టెక్నాలజీ విషయంలో సహకరించారని గ్రహాంతర వాసుల గురించి పరిశోధనలు చేస్తున్న శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు.. ఈ ఏలియన్సులే భారత కాలంలో దేవతలు కావచ్చు. కురుక్షేత్ర యుద్ధంలో ఇరుపక్షాలూ చాలా శక్తిమంతమైన ఆయుధాలనే వాడాయి. కత్తులు, కటార్లు, బాణాలు, గదలు వంటి ట్రెడిషనల్ ఆయుధాలు ఎలాగూ వున్నాయి. వీటితో పాటు ప్రమాదకరమైన వార్హెడ్స్ ఉన్న మిస్సైల్స్ ప్రయోగాలు భారత వీరులు ఆనాడే చేసినట్లు తెలుస్తోంది. క్షిపణి ప్రయోగంలో భీష్మ, అర్జున, కర్ణులు గ్రేట్ వారియర్స్ అని చెప్పవచ్చు. అంతే కాదు.. వైమానిక దాడుల్లోనూ కురుపాండవ సైన్యాలు పాల్గొన్నాయి.

పాండవసైన్యం వైమానికదాడి ద్వారా ఇందూస్ వ్యాలీలో న్యూక్లియర్ వెపన్ ప్రయోగించటం వల్ల అక్కడ సర్వనాశనం జరిగిందని ఆర్కియాలజిస్టుల అంచనా. దీని కాలాన్ని కూడా 5వేల సంవత్సరాల పైనేనని అంతర్జాతీయ నిపుణులు సైతం ధృవీకరించారు. న్యూక్లియర్ వెపన్ టెక్నాలజీని పాండవులు అరణ్యవాస కాలంలో సాధించినట్లు తెలుస్తోంది. అడవిలో ఉన్న పన్నెండు సంవత్సరాల కాలాన్ని యుద్ధానికి తగిన ఆయుధాలను సమకూర్చుకోవటానికి పాండవులు అనుకూలంగా మార్చుకున్నారు. అణ్వస్త్రంతో పాటు దానికంటే వంద రెట్లు శక్తిమంతమైన పాశుపతాస్త్రాన్ని సైతం అర్జునుడు సంపాదించాడు. కానీ, దాన్ని అతను భారత యుద్ధంలో ప్రయోగించలేదు. వైమానిక దాడుల్లో మన వారు ఆనాడే మంచి టెక్నాలజీని వాడారు. భారత కాలంలో ఉపయోగించిన రవాణా, యుద్ధ విమానాలో మెర్క్యురీని ఇంధనంగా వాడారు. ఈ విమానాలు కూడా ఇవాల్టి యుద్ధ విమానాలకు ఎంతమాత్రం తీసిపోవు. ఇప్పటి విమానాల మాదిరిగానే, నాటి విమానాలు సైతం వార్హెడ్లను కలిగి ఉన్నట్లు తెలుస్తోంది. ఆధునిక ఆయుధాలు ఎన్ని వాడినా, సంప్రదాయ అస్త్రాలైన బాణాలకే భారత యుద్ధంలో ప్రాధాన్యం ఎక్కువ లభించింది. యుద్ధంలో పాల్గొన్న యోధులందరిలో దాదాపు 60 శాతం మంది విలుకాళ్లే కావటం విశేషం.. రకరకాల విష పూరిత అస్త్రాలతో శత్రువులపై దాడి చేయటంలో వీళ్లను మించిన వాళ్లు లేరు. మహాభారత యుద్ధం క్రీస్తుపూర్వం 3138 డిసెంబర్ 25న ప్రారంభమై 18 రోజుల్లో సుమారు 36 లక్షల మంది ప్రాణాలను బలిగొంది. ఇరువైపులా రాటుదేలిన యుద్ధ తంత్ర నిపుణులు ఉండటంతో కురుక్షేత్రం అస్తిపంజరాల గుట్టగా మారిపోయింది. చివరకు పోయినోళ్లందరూ పోగా మిగిలింది పదకొండు మంది. పద్మవ్యూహం.. దీని గురించి విననివారు బహుశా ఉండరు.. ఎవరైనా ప్రత్యర్థి వలలో చిక్కుకుపోతే ఒక జాతీయం లాగా అంటే ఇడియమెటిక్ ఎక్స్ప్రెషన్లా దీన్ని వాడతారు. ఈ పద్మవ్యూహం కురుక్షేత్ర యుద్ధంలో శత్రువును మట్టుపెట్టడానికి వేసిన పన్నాగం. అర్జునుడి కుమారుడు అభిమన్యుడు ఈ పద్మవ్యూహంలో చిక్కుకుని విలవిల్లాడిపోయాడు. తప్పించుకుని బయటకు ఎలా రావాలో తెలియక చనిపోయాడు. పద్మవ్యూహం మాదిరిగా సైన్యాన్ని ఒక చిక్కుముడిలా మోహరించటంలో కురుపాండవుల గురువు ద్రోణాచార్యుడు సిద్ధహస్తుడు. ఇలాంటి ఎత్తుగడలను కురుక్షేత్ర యుద్ధంలో ఇరుపక్షాలూ పెద్ద ఎత్తున వినియోగిం చుకున్నాయి. ఇటు కృష్ణుడు, దృష్టద్యుమ్నుడు, అటు భీష్ముడు, ద్రోణుడు, కర్ణుడు రెండు సైన్యాలకు థింక్ట్యాంక్గా ఉపయోగపడ్డారు. 18 రోజుల్లో జరిగిన యుద్ధంలో దాదాపు 19 వ్యూహాలను.. కురుపాండవులు ఒకరిపై ఇంకొకరు పన్నారు. అందులో పద్మవ్యూహం ఒకటి. ఇవి కాకుండా క్రౌంచ, మకర, చక్ర, గరుడ, మండల, వజ్ర వ్యూహాల్లాంటివి చాలా ఉన్నాయి. ప్రత్యక్ష యుద్ధంలో ఒకరి సైన్యంపై మరొకరి సైన్యం తలపడి యుద్ధం చేయాల్సిన పరిస్థితి.



కోవెల సంతోష్ కుమార్
రచయిత, 90521 16463

(..ఇంకా ఉంది..)

రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
‘ప్రజావాణి’ వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి ‘ఈవార్తలు’ పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.